డిసెంబర్ - 2025

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| "ది బెస్ట్" | కె.ఇ. రాజేంద్ర | 07 |
| నన్ను పంపినవాని... | హన్నాకృప డెస్క్ | 08 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| నా విమోచకుడు | సాక్ష్యము | 10 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| క్రీస్తును నేర్చుకొనుట... | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| క్రీస్తు మనస్సు | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-12 | | 24 |




**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,

**చందా వివరాలు :**
**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726

**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


సీరియల్ నంబరు

సంపాదకీయం....

# నిజ క్రిస్మస్

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

మన ఇంట్లో కుటుంబ సభ్యులలో ఎవరి పుట్టిన రోజు వచ్చినా, వారిని సంతోషపెట్టాలని వారికి ఇష్టమైనవన్నీ చేస్తాము కదా! వారితో పాటు మనం కూడా చాలా సంతోషిస్తాము. ఈ సంతోషమంతా మన కుటుంబానికే పరిమితమై ఉంటుంది. అయితే ఈ లోకరక్షకుడుగా మన పాపముల పరిహారార్ధం యేసు ఈ లోకంలో జన్మించాడు. మనం నరకానికి వెళ్ళకుండా మనల్ని పరలోకము తీసుకొని వెళ్ళడానికి మన పాపముల నిమిత్తం సిలువలో మరణించి తిరిగి లేచాడు. యేసుక్రీస్తు రెండవసారి వచ్చి మనల్ని పరలోకరాజ్యానికి తీసుకెళ్తాడని మనందరికి తెలుసు. యేసుక్రీస్తు పుట్టి రెండువేల సంవత్సరాలకు పైగా గడిచిపోయాయి. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంటాము. అయితే యేసుక్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ రోజున మనం ఆయన కొరకు ఏం చేస్తున్నాము? ఆయనను ఎంతవరకు సంతోషపెడుతున్నాము? దేవునికి ఇష్టమైన పనులు చేయకుండా మనంమాత్రమే పండుగ చేసుకోవడం ఎంత వరకు సమంజసం. మనం అతిగా ప్రేమించే మన కుటుంబ సభ్యులు ఈ లోకంలో లేకపోయినా సరే, వారి జన్మదినమును పురస్కరించుకొని అనేక కార్యక్రమాలు చేస్తాము. అన్నదానాలని, రక్తదానాలని, పేదలకు బట్టలు ఇవ్వటంలాంటి కార్యక్రమాలు చాలామంది చేస్తారు. ఎందుకంటే వారిపట్ల చూపించే ప్రేమకు నిదర్శనంగా ఇవన్నీ చేస్తారు. మనం ఎంత ఖర్చు చేస్తున్నామన్న దానినిబట్టి వారి మీద మనకున్న ప్రేమని చూపిస్తాము. అయితే యేసు పుట్టిన రోజైన క్రిస్మస్ సందర్భంగా మనం ఇతరులకి ఏం చేస్తున్నామన్నదాన్ని బట్టి మనం యేసుని ఎంత ప్రేమిస్తున్నామో అర్ధమవుతుంది. *"మిక్కిల అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను"* (మత్తయి 25:35-40) అని చెప్పినట్లు మిక్కిలి అల్పులైన వారికి నీవు ఏమి చేసినా అది దేవునికి చేసినట్లే. మరి ఈ క్రిస్మస్ రోజున క్రొత్త బట్టలు ధరించి, ఇంటిని అలంకరించుకొని, పిండివంటలు, బిరియానీలు చేసుకొని, బంధువులతో, స్నేహితులతో నీవు మాత్రమే సంతోషంగా ఉండాలనుకుంటున్నావా? యేసు పుట్టిన రోజున ఆయనను సంతోషపరచాలని అనుకుంటున్నావా? యేసును సంతోషపరచాలనుకుంటే పేదవారికి నీవు కుట్టించుకున్న క్రొత్తబట్టలు ఇచ్చి, నువ్వు వండుకున్న బిరియాని పెట్టి, నీ సంతోషాన్ని వారితో పంచుకుంటే ఆయనకు చేసినట్లే. అది ఆయన మీద మనకున్న ప్రేమను నిర్ధారిస్తుంది. యేసు పుట్టిన రోజున ఆయనకు ఇష్టమైనవి చేసి ఆయనను సంతోషపెట్టినప్పుడు మాత్రమే అది 'నిజ క్రిస్మస్' అవుతుంది తప్ప నువ్వు కొత్తబట్టలు ధరించి, పిండివంటలు, బిరియానిలు తింటే కాదు. మరి ఈ క్రిస్మస్ రోజున నీవు యేసుని ఏ విధంగా సంతోషపరచాలనుకుంటున్నావు? యేసు చెప్పినట్లు మిక్కిలి అల్పులైన వారికి చేసి యేసును సంతోష పరచడానికి నీవు సిద్ధమా?

**-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు

42

**(యోసేపు జీవిత చరిత్ర)**

**– కొదవటికంటి**

దేశాటన మొదటిరోజునే చాలా అలసిపోయినట్లనిపించింది. మనసంతా ఐగుప్తు మీద ఉంది. ఈ పర్యటన పూర్తయిన తర్వాత తన యొక్క బాధ్యత పూర్తిగా అర్ధమయ్యింది. తను వేసే ప్రతి అడుగు, పలికే ప్రతి మాట ఒక దేశం మొత్తానికి సంబంధించింది. జప్నత్పనేహు అంటే ఇప్పుడు ఒక దేశం అని అర్ధం. ప్రపంచంలో అత్యంత నాగరికమైన, ధనవంతమైన, సారవంతమైన దేశానికి తను అధిపతి. ఇప్పుడు ఆసెనతు స్థానంలో ఐగుప్తు ఉంది.

ఉదయాన్నే, దక్షిణ దేశ ప్రయాణం. నైలునదికి పడమర వైపు, అంతా దాదాపు చనిపోయినవారి వశం. నూబియా దేశం చేరే వరకు సమాధులు, దేవాలయాలు. దేశమంతా తిరగాలి కదా! సక్కారా వచ్చేంత వరకు అంతా ఇసుక. ఎంత కట్టుదిట్టమైన భద్రతలు తీసుకున్నా, ఇసుక రేణువులను తప్పించుకోవటం కష్టం. సక్కారా అంతా సమాధులే.

మెంఫిస్ పట్టణం ప్రక్క ఉన్న నియోపోలిస్‌లో ఉన్న ఎద్దు దేవాలయం, అక్కడ పూజింపబడిన ఎద్దుల సమాధులు పదమూడు అడుగుల పొడవైనవి. ఇక్కడ పదకొండు చిన్న పిరమిడ్లు ఉన్నాయి. వీటికి ఆరుమెట్లు. ఒక్కొక్క మెట్టు ఆరు అడుగుల వెడల్పు, ఇరవై తొమ్మిదినుండి ముప్పై అడుగుల వరకు ఉంటుంది. ఈ పిరమిడ్లు చియోప్స్ కన్నా పురాతనమైనవి అని చెప్పబడుతున్నవి.

ప్రయాణం అంతా ఒంటెల మీదనే జరిగింది. ప్రతి పట్టణం, ప్రతి పల్లెవద్ద జనం గుంపులు, గుంపులుగా స్వాగతం పలికారు. తమ పరిపాలకుని చూచి ముచ్చట పడ్డారు. అందమంటేనే జప్నత్ప అని అనేవారు. ఐగుప్తు అంతటా 'జప్నత్ప అంత అందగాడు' అనే నానుడి ప్రభలింది. తను ఈ పదవిని అలంకరించక ముందు ఈ దేశమంతటా చూచినట్టయితే, మనస్ఫూర్తిగా ఈ దేశం అర్ధమయ్యే వరకు దాన్ని తరచి చూచేవాడు.

ప్రతి పట్టణం, పల్లెలోను ధాన్యాగారాలు నిర్మించవలసిన ప్రదేశం దాని కొలతలు ముందుగానే తయారు చేయబడినవి. థేమాను యొక్క ఏర్పాట్లు అన్నీ జప్నత్ప యోచించినట్లుగానే జరిగాయి. వియాన్, అక్షావు, థేమాను ఇంతవరకు చేసిన ఏర్పాట్లు, ఇప్పుడు జప్నత్పకు పని తగ్గించాయి. తను మనుష్యుల యొక్క యోగ్యతలు లెక్కించటంలో పొరపాటు చేయలేదన్న నమ్మకం ఇప్పుడు పూర్తిగా నాటుకుపోయింది.

తెబెస్ పట్టణం గురించి విన్నాడే కాని, ఇప్పుడు ఆ పట్టణంలో ప్రవేశించగానే, ఆ పట్టణం యొక్క వైభవానికి ఏ మాత్రం అతిశయోక్తి లేదనిపించింది. తెబెస్ పట్టణం ప్రపంచంలోని ఏ పట్టణం కన్నా విస్తీర్ణంలో, జనసంఖ్యలో తీసిపోదు. నైలునదికి రెండువైపులా అటు ఇటు ముప్పై మూడు మైళ్ళ పొడవున ఉంది. ఇక్కడ నైలునది వెడల్పు పన్నెండు మైళ్ళు. తెబెస్ పట్టణం పదిమైళ్ళ దూరంలో ఉండగానే దాని ఎత్తయిన కట్టడాలు కనబడుతున్నాయి. యవ్వనంలో ఉన్న ప్రకృతికి నైలునది, జలసమృద్ధి, ప్రతి దినం నూతన శోభను కూర్చుతుంది. నైలునది యొక్క అద్భుతమైన పరివాహక సమృద్ధి అంతా తెబెస్ పట్టణం ఒక్కదాని కోసమే అనిపిస్తుంది. ఎడారి దాటి తెబెస్‌లో అడుగు పెట్టగానే ఇన్ని రోజుల వేడి, నిర్జీవత్వం అంతా క్షణంలో మర్చిపోగలుగుతాము. రాజధాని వదలిన రెండు నెలలో ఐగుప్తు యొక్క ఈ చివరికి వచ్చారు.

తెబెస్ పట్టణం బహు పురాతనమైనది. మెంఫిస్ పట్టణం ఐగుప్తు రాజధాని చేయబడక పూర్వం తెబెస్ పట్టణమే ఐగుప్తు రాజధాని. దానికి 'నూరు ద్వారముల నగరు' అని పేరు. తెబెస్ పురాతన పేరు నియోపోలీస్. ఇక్కడ అయిదు అంతస్థుల మిద్దెలు కూడా ఉన్నాయి. కాని ఇప్పుడు అవన్ని మెంఫిస్ పట్టణం వలన చిన్నచూపు చూడ

బడినవి. తెబెస్ నుండి ప్రయాణం తిరుగు ముఖం పట్టారు. ఈ ప్రయాణం అంతా దాదాపు పడవ మీదనే. బహు శృంగారంగా అలంకరించబడిన పెద్దపడవను ప్రయాణం నిమిత్తం ఏర్పాటు చేసారు. దాదాపు ఇంట్లో ఉండే అన్ని వసతులు అందులో అమర్చారు. పడవ ప్రయాణం ఎనిమిది వందలమైళ్ళు. తన పడవకు ముందు రెండు పడవలలో వెనుక ఏడు పడవలలో సైనికులు ప్రయాణం చేస్తారు. అవసరమైన చోట తన పడవ నుండి వేరే చిన్న పడవ ద్వారా ఒడ్డుకు వచ్చి అక్కడ వ్యవసాయం, నీటిపారుదల ఏర్పాట్లు, ధాన్యం భద్రపరచే విధానాల ఏర్పాట్లు అన్ని స్వయంగానే చూసేవాడు. మొత్తం ప్రయాణం మూడు నెలల్లో ముగిసింది. ఆసెనతు ప్రసవించే సమయం దగ్గర పడుతుంది. తను ఎక్కడ ఉన్నా రాజధాని నుండి, ఆసెనతు వద్ద నుండి కూడా వార్తలు అందుతుండేవి.

సమృద్ధిగా పంట పండే మొదటి సంవత్సరం కోత ఆరంభంలో జప్నత్ప మెంఫిస్ చేరుకొనినప్పుడు, అతనికి ఘనమైన స్వాగతం లభించింది. ఫరో స్వయంగా రేవుకు వచ్చి, తన రథంలో తన ప్రక్కన కూర్చోబెట్టుకుని తీసుకుని వెళ్ళాడు. ఫరో యొక్క ఆత్మీయతకు జప్నత్ప తన హృదయం లోనే కృతజ్ఞత చెప్పుకున్నాడు. ఆసెనతుని ఇంటివద్ద మొదటిసారిగా చూచినప్పుడు ప్రక్కన ఎవరు లేకుండా ఉంటే బాగుండు అనుకున్నాడు. కాని అందుకు వ్యతిరేకం గానే జరిగింది. ఓను యొక్క యాజకులందరు పోతీఫెర, ఇంటివద్ద స్వాగతం పలికారు. సమృద్ధిగా పండే ఏడు సంవత్సరాలలో మొదటి సంవత్సరం పంట కోత కాలంలో, ఆ పంట విరివిగా పండటం, ఇంతకు ముందు పంట చూసిన పెద్దలకు విస్మయము కలిగించింది. అది చూసిన పెద్దలు జప్నత్ప హస్తవాసి మంచిదని అన్నారు. తన భార్యకంటే, తన అత్తమామలు తన కోసం దిగులు పడిపోయి నట్లుగా అనిపించారు. నిండు చూలాలు అయిన భార్యను ఏ విధంగా చూసుకుంటున్నారో, దాదాపు వెయ్యి మైళ్ళు అవిశ్రాంతంగా తిరిగి వచ్చిన తనని కూడా అలానే చూసు కున్నారు. ఇంటి అల్లునిగా ఐగుప్తీయులు ఇచ్చే గౌరవ మర్యాదలు, జప్నత్పను అనేకసార్లు ఇబ్బందిలో ముంచేసేవి. కాని వారి ప్రేమ అటువంటిది. తనకోసం, ఆసెనతు కోసం ప్రత్యేకంగా విశాలమైన రెండు గదులు ఏర్పాటు చేసారు. ఐగుప్తుదేశంలో ఇన్ని సంవత్సరాలు జీవించినప్పటికి, మామగారి ఇంట్లోని అనుభవం క్రొత్తగా ఉంది. తండ్రి తనని ప్రేమించిన తీరు, పోతీఫరు అతని భార్య ఇచ్చిన గౌరవం, చెరసాల అధిపతి యొక్క దయ, స్నేహితుల అభిమానం, ఫరో కరుణ, ఆసెనతు ప్రేమకంటే, తన అత్తమామల ప్రేమ తనని చాలా చిన్నవానిగా చేసినవి. వారు తమ ఒక్కగానొక్క కుమార్తె ఆసెనతు యొక్క భవిష్యత్తు, ఆమె సంతోషములు, ఎవరితో పెనవేయబడి ఉన్నవో, నేడు వాటికి మూలం ఎవరో అతనిని భయంతోను, పుత్ర వాత్సల్యంతోను చూచారు.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"అరణ్యములోనికా!" అంది.

"అరణ్యమైన, ఎడారైనా ప్రేమ ఉన్నచోట ఉద్యానవనము వలే అనుభూతి కలుగు తుంది. మీకాలు అలంకరించబడిన బొమ్మ అని అప్పుడు గ్రహించలేకపోయాను. అహీనోయము కదిలే బొమ్మ" అన్నాడు ఆమెను చూస్తూ చెయ్యి పట్టుకొని ఉద్వేగంతో.

"మరి" అని ఆగింది.

"మరి నువ్వా" అని ఆగి "నువ్వు హృదయమున్న మనిషివి. అందుకే కిల్యాబు దానియేలు అయ్యాడు నీ గుణాలు పోసుకొని పుట్టిన నీ కుమారుడు కదా!" అని అటూ ఇటు చూసి "ఏడి? ఎక్కడ?" అన్నాడు.

చుట్టూ చూస్తూ గంట శబ్దం "ఎవరో వచ్చారు" అంటూ అబీగయీలు లేచింది వెళ్లటానికి.

"అబీ" అన్నాడు. ఆగింది.

"ఈ రాజరికంలో, ఈ మరో ప్రపంచంలో ఇంకెంత మంది భార్యలుగా వస్తారో తెలియదు కాని, ఒక రాజు వేరే రాజ్యం జయిస్తే అతని భార్యలందరూ అతని ఆస్తి అవుతారు" అన్నాడు ఆలోచిస్తూ.

"లేవండి, ఇలా భవిష్యత్తును ఆలోచిస్తుంటే మన చేతిలో లేనిదాన్ని గురించి మన ఆధీనంలో లేనిదాని గురించి మనం ఎందుకు ముందుగా విచారించాలి. దుఃఖించే సమయం వస్తే దుఃఖించవచ్చును" అన్నది. అబ్నేరు ఇరవై మంది ఇశ్రాయేలు పెద్దలతో కలసి హెబ్రోనులో దావీదు సన్నిధికి వచ్చినప్పుడు ఆ పట్టణమంతా సంతోషించింది. పెద్దలు, దావీదు వారి వారి ఆసనముల మీద కూర్చున్నారు. అటు ఇటు యూదా వారు కూర్చుని వున్నారు.

అబ్నేరు సమావేశ మందిరంలో అడుగుపెట్టి ఎదురుగా కూర్చున్న దావీదును చూసి ఆగిపోయాడు. తన మెదడంతా ఎంతో చురుకుగా పనిచేయ నారంభించింది. ఈ దావీదునే తాను చంపాలని ఎంతో ప్రయత్నించింది. దాదాపు పది సంవత్సరాల నిరంతర కృషితో వుండినది. దావీదును దేవుడే కాపాడి యుండకపోతే ఏనాడో మరణించి ఈపాటికి మరువ బడియుండేవాడు అనుకుంటూ నమస్కరించాడు.

తనకు నమస్కరిస్తున్న అబ్నేరును చూచి ఒక్కింతసేపు దావీదు అచేతనుడయ్యాడు. అప్పుడు గొల్యాతు తల తన చేతిలో ఉండగా ఆప్యాయంగా సౌలు దగ్గరకి తీసుకెళ్ళిన వాడు. అరణ్యంలో సౌలు నిద్రిస్తున్నప్పుడు సరిగా కాపు కాయలేదని అబ్నేరును నువ్వు మగవాడివి కావా? అని ప్రశ్నించినది ఇతనినే కదా! తాను మరణించియుంటే సౌలు తర్వాత ఇశ్రాయేలీయులనందరిని ఏలవలసిన వాడు. లేచి ఆహ్వానిద్దామనుకున్నాడు కాని రాజుగా తాను ఆ విధంగా ప్రవర్తించకూడదని మౌనంగా ఉన్నాడు. అబ్నేరు, అతని వెంట ఇరవైమంది యోధులు ముందుకు నడిచి వచ్చారు. సాదరంగా అబ్నేరును ఆహ్వానించాడు. మిగిలిన వారిని కూడా కూర్చుండ చేశాడు. పాత పగలు, కక్షలు కాని ఇవి ఏవి కూడా బయటకు రాలేదు. దావీదు ఇంతకు ముందు నుండి రాజైనట్లుగాను ఇశ్రాయేలు పది గోత్రములవారి మనోభిష్టమును తెలుపుటకై వారు ఎన్నుకున్న పెద్దగా దావీదు నొద్దకు వచ్చినట్లుగా మాట్లాడాడు అబ్నేరు.

దావీదు కూడా అదే విధంగా దేవుడు ఎన్ని మేళ్ళు చేసాడో మాట్లాడిన తర్వాత విందుకు కూర్చున్నారు. చాలా ఘనంగా ఏర్పాటు చేయబడినది. యూదా గోత్రములోని పెద్దలు ముందుగా ఆహ్వానించబడినవారు ఇశ్రాయేలు బెన్యామీను గోత్రములోని అందరూ కలసి సంతోషించారు. ఎన్నో మాట్లాడుకున్నారే కాని ఈ మధ్యకాలంలో జరిగిన యుద్ధాలను గూర్చి ఒక్కమాటైనా ఎవరూ పలుకలేదు.

భోజనాలు అయిపోయిన తర్వాత అబ్నేరు దావీదు యొద్దకు వచ్చి మరలా ఇశ్రాయేలు రాజ్యమంతట తిరిగి

నాలుగు రోజులలో కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి యోవాబు వచ్చాడు. వస్తూనే వందనమైన చెయ్యలేదు ముఖం ఉబ్బి ఉంది.

“చిత్తగించుము” అని తలవంచి విసురుగా నమస్కరించి నట్లు “నీవు ఏమి చేసితివి?” అన్నాడు గర్జించినట్లుగా. చుట్టు వున్న వాళ్ళంతా యోవాబు వైపు అయిష్టంగా చూచారు.

“అబ్నేరు నీ యొద్దకు వచ్చినప్పుడు నీవెందుకు అతనికి సెలవిచ్చి పంపివేసితివి? నేరు కుమారుడైన అబ్నేరు గురించి నీవెరుగవా? నిన్ను మోసపుచ్చి నీ రాకపోకలన్నిటిని నీవు చేయు సమస్తమును తెలిసికొనుటకై అతడు వచ్చెను” అని ఎంత వడిగా లోపలికి వచ్చాడో అంత వడిగా వెళ్ళిపోయాడు.

గుఱ్ఱముల మీద కూర్చుని ఒక ప్రక్క తర్ష్నాను మరియొక ప్రక్క ఎలీకా వెళ్తుంటే హెబ్రోను లోయ దాటి పైకొచ్చిన ఇద్దరు సహచరులతో కొండ ఎక్కుతున్న అబ్నేరు వెనుతిరిగి చూస్తే హెబ్రోను లోయలోనికి నేరుగా దిగుతున్న అశ్వికుడు కనిపించాడు. గుఱ్ఱాలను ఆపి వెనుకకు త్రిప్పి వస్తున్నతను ఎవరా అని చూస్తున్నారు. దావీదు సేవకుల అశ్వము చూసి సంతోషంగా చూస్తున్నారు. దగ్గరగా వచ్చినప్పుడు “శోబాలు నువ్వా” అన్నాడు అబ్నేరు. అతను గుఱ్ఱము దిగి అబ్నేరుకు నమస్కరించి “మీరు హెబ్రోను వచ్చినప్పుడు యోవాబుగారు లేకపోయినందుకు విచారించారు. మీరు ఒక చిన్న మాట విని వెళ్ళవలెనని నన్ను పంపించారు” అన్నాడు.

వారు నలుగురు కలసి సిరా బావి యొద్దకు వచ్చినప్పుడు వారి కొరకు ఇంకా ఇద్దరు వేచి ఉన్నారు. అందరూ కలసి ఊరిలోనికి వచ్చారు. హెబ్రోను కోట గవిని యొద్దకు వచ్చినప్పుడు యోవాబు అబ్నేరును చూస్తుండగానే గవిని ద్వారబందమునకు కుడి ప్రక్కన కావలివాని గది వెనుకకు వెళ్ళాడు. అబ్నేరును చూస్తు యోవాబు సైగ చేశాడు. అబ్నేరు తర్ష్నానుకు గుఱ్ఱం కళ్ళాలు అందించి నడుస్తూ గవిని ద్వారము దగ్గరకు వెళ్తుంటే అక్కడ నిలుచున్న మరికొందరు చూస్తున్నారు. అబ్నేరు అలా గోడ ప్రక్కకి వెళ్ళిన వెంటనే యోవాబు ఒక్కడే గవిని యొద్దకు వచ్చి అక్కడున్న తన గుఱ్ఱమును ఎక్కుతుంటే అతని కడుపు ప్రాంతమంతా ఎర్రగా రక్తమువలె కనిపించింది. వెంటనే తర్ష్నాను పరుగెత్తి అబ్నేరు వెళ్ళిన వైపు వెళ్ళి పెద్దగా అరిచాడు. అప్పటికే యోవాబు గుఱ్ఱం మీద వెళ్ళిపోయాడు.

తర్ష్నాను, ఎలీకా అబ్నేరు శవం ఎత్తుకొని గవిని అరుగు మీద పండబెట్టారు. సైనికులతో గవిని కాపలా కాస్తున్న ఇద్దరు భటులు గబగబా రాజమందిరం వైపు పరుగెత్తారు.

అహీతోపెలు దావీదు దగ్గరకి వచ్చేటప్పటికి బాగా చీకటి పడింది. అబ్నేరు శవమును రాజమందిరములోనికి తీసికొని వచ్చి మరునాటికి శవమును సిద్ధం చేస్తున్నారు. అహీతో పెలును చూసి దావీదు కృంగిపోయాడు.


“చూశారా యోవాబు చేసిన పని” అన్నాడు అహీతో పెలు అక్కడనే కూర్చుంటూ.

దావీదు “నేనును నా రాజ్యమును నేరు కుమారుడైన అబ్నేరు ప్రాణం తీయుట విషయంలో యెహోవా సన్నిధిని ఎప్పటికిని నిరపరాధులలో స్రావముగలవాడైననూ, కుష్ఠ రోగియైనను, కర్రపట్టుకొని నడుచు వాడైననూ ఉండక పోదు గాక!” అని కూర్చుని సన్నగా రోదించనారంభించాడు.

మరునాడు ఉదయమే దావీదు బట్టలు చింపుకొని గోనె పట్ట కట్టుకొని కూర్చున్నాడు. క్రిందటి రాత్రి గిబియాకి వెళ్లిన అశ్వికులు అబ్నేరు మరణవార్త వినిపించగా వచ్చిన ఇశ్రాయేలీయుల పెద్దలు, అబ్నేరు బంధువులు బహు జనులతో హెబ్రోను నిండిపోయింది. వారందరిని చూసి దావీదు లేచి నిలబడి యోవాబు వైపు చూచి మీ బట్టలు చింపుకొని గోనెపట్ట కట్టుకొని అబ్నేరు శవమునకు ముందుగా నడుచుచూ ప్రలాపము చేయుడని బహు బిగ్గరగా ఆజ్ఞ ఇచ్చాడు. పాడె కదలిపోతుంటే దావీదు ప్రక్కగా ఏడుస్తూ నడిచాడు. అబ్నేరును పాతిపెట్టిన తర్వాత దావీదు ఆ ప్రక్కనే చెట్టు మోదెపై కూర్చుని “అబ్నేరూ, నీచుడొకడు చచ్చునట్లుగా నీవు చావతగునా? నీ చేతులకు కట్లు లేకుండగను నీ కాళ్ళకు సంకెళ్ళు వేయబడకుండగను దోషకారి యొద్ద ఒకడు పడునట్లు నీవు పడితివే” అని పెద్దగా ప్రలాపిస్తూ పాడుతుంటే అక్కడున్న వారందరు పెద్దగా రోదన చెయ్యసాగారు. **(సశేషం)**




# ‘ది బెస్ట్’



మంచి వాటిని ఎంచుకోవడం మనుష్యుల సహజ నైజం. ప్రతి దాంట్లో ది బెస్ట్ కావాలనుకుంటారు. తినే తిండి, వేసుకొనే బట్టలు, ఉండే ఇల్లు, చదువు, పెళ్ళి ఇలా మనం ఏది ఎంచుకోవాల్సి వచ్చినా మంచిది ఎన్నుకుంటామే తప్ప ఏదో ఒకటిలే అనుకోరు.’ది బెస్ట్’ ఎంచుకొనేటప్పుడు ఏ మాత్రం రాజీపడని వాళ్ళు కూడా ఉంటారు. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు, ఎంత టైం పట్టినా పర్వాలేదు అన్నట్లు ‘ది బెస్ట్’ కోరుకుంటారు. చాలామంది ఒక మంచి భర్త, భార్య కోసం ఎంతకాలమైనా ఎదురు చూసేవాళ్ళుంటారు. మంచి చదువు చదవడానికి ఎంత డబ్బైనా ఖర్చు చేసేవారుంటారు. పేదవాళ్ళు, గొప్పవాళ్ళు అన్న తేడా లేకుండా వాళ్ళకున్నదాంట్లో మంచి వాటినే కోరుకుంటారు. అంటే ఉత్తమమైన వాటిని కోరుకుంటారు. అయితే దేవుని విషయంలో ‘ది బెస్ట్’ అనేది ఏంటో ఎవరికీ తెలీదు. చర్చికి వెళ్ళడం, బైబిలు చదవటం, ప్రార్థన చేసుకోవడం ‘ది బెస్ట్’ అనుకుంటారు. కొంతమంది చర్చికి వెళ్ళడమే గొప్ప విషయం అనుకుంటారు. కొంతమంది ప్రార్థనకి మించినది లేదు అనుకుంటారు. కొంతమంది బైబిలు జ్ఞానం ఉంటే చాలు అనుకుంటారు. సువార్త ప్రకటించడమే దేవుడు కోరుకుంటాడు కాబట్టి అదే ‘ది బెస్ట్’ అనుకుంటారు. మన ఆలోచన ప్రకారం, మనకి ఏది ఇష్టం అనిపిస్తే, అదే దేవుని ఇష్టమని భావించి ‘ది బెస్ట్’ అనుకుంటాము. అయితే యేసుప్రభువు దృష్టిలో ‘ది బెస్ట్’ ఏంటనేది ఆయనే స్వయంగా చెప్పాడు. ‘మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే, మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు’ (లూకా 10:41,42) అని మనుష్యులకు అవసరమైనది, ఉత్తమమైనది ఒక్కటే అది ‘దేవుని సన్నిధి’ అని చెప్పాడు. మార్త ఏమీ టీ.వి. చూస్తూనో, ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటూనో మరియను పంపమని అడగలేదు. యేసుప్రభువుకి, ఆయన శిష్యులకు పరిచర్య చేస్తూ మరియని సహాయపడటానికి పంపమని యేసుని అడిగింది. నిజానికైతే యేసుప్రభువే మరియతో చెప్పాలి ‘అక్క చాలా కష్టపడుతుంది, వెళ్ళి అక్కకి సహాయం చెయ్యి’ అని. అయితే ఆయన అలా చెప్పకపోగా ‘మరియ రాదు, నీ పని నువ్వే చేసుకో’ అని చెప్పినట్లుగా ‘మరియ ఉత్తమమైనది ఏర్పరచుకుంది, అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు’ అని చెప్తే పాపం మార్త పరిస్థితి ఏంటి? చాలామంది అంతే, దేవుని పని చేస్తున్నామని సంబరపడిపోతారు, ఒళ్ళు హూనం చేసుకొని మరీ చర్చిలో పనులు చేస్తారు, సువార్త సభల కోసం కష్టపడతారు, పాస్టర్లు, సువార్తికులు వస్తే వాళ్ళకి చికెన్ బిరియాని చేయడానికి చాలా కష్టపడతారు కానీ వాళ్ళు దేవునిలో ఎదగాలని కోరుకోరు, దేవుని వాక్యము మీద శ్రద్ధ పెట్టరు. మరియ యేసు పాదాల దగ్గర కూర్చుని ఆయన మాటలు వింటూ ఈ లోకాన్నే మర్చిపోయింది. దేవుని సన్నిధిలో గడపడమనే ‘ది బెస్ట్’ మరియ ఎన్నుకుంది. దేవుని సన్నిధిలో ఉండటమంటే మనం చేయాల్సిన పనులన్నీ మానేసి ఏ చర్చిలోనో, ఇంట్లోనో ఒక మూల కూర్చొని బైబిలు చదువుతూనో, ప్రార్థన చేసుకుంటూ ఉండటమో కాదు గానీ, మనం ఏ పని చేస్తున్నా, ఎక్కడికి వెళ్తున్నా మన హృదయములో, మన ఆలోచనలలో దేవుని గూర్చి తలపోసుకుంటూ ఉండటమే దేవుని సన్నిధిలో గడపటం. ఈ లోకంలో మనకోసం మనం ఏర్పరచుకొనేవి మనకు ‘ది బెస్ట్’ కాక పోవచ్చు కానీ, మరియలా యేసు సన్నిధిని కోరుకుంటే అంతకంటే **‘ది బెస్ట్’** ఇంకేదీ ఉండదు. మరి మీకు...?

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# నన్ను పంపినవాని చిత్తము...

**"నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని" (యోహాను 6:38).**

**'చిత్తము'** అంటే **'ఇష్టము'** అని అర్ధము. దేవుని చిత్తాన్ని నెరవేర్చడమంటే, దేవుని ఇష్టాన్ని నెరవేర్చడం. దేవుని ఇష్టాయిష్టాలేంటో తెలియకపోతే మనం దేవుని చిత్తాన్ని నెరవేర్చలేము. ప్రభువా, ప్రభువా అని పిలిస్తే కుదరదు నా తండ్రి చిత్త ప్రకారము చెయ్యాలి అని యేసుప్రభువు చెప్పాడు. ముందు తండ్రి చిత్తమేమిటో తెలుసుకోవాలి, దాని ప్రకారము మనం నడుచుకోవాలి, ఆ తర్వాతే మనం దేవునికి మొక్కుపెట్టుకోవాలి. ***"కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందు టయే నా తండ్రి చిత్తము"*** (యోహాను 6:40). యేసుప్రభువు నందు విశ్వాసముంచటమే తండ్రి చిత్తము. దేవుని కుమారుడైన యేసుప్రభువునందు విశ్వాసము ఉంచకుండా ఆయన నామమున మనం దేవునికి ప్రార్ధన చేస్తే ఆ ప్రార్ధన అంగీకరింపబడదు. ***"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము"*** (హెబ్రీ. 11:6). యేసుప్రభువు నందు విశ్వాసముంచుట ద్వారా మనం దేవునికి ఇష్టులుగా ఉండగలము. యేసును విశ్వసించి ఆయనను మన హృదయములోనికి ఆహ్వానిస్తే మనం పరిపూర్ణులము అవుతాము. ఈ లోకంలో మనం ఇంకేమి కోరుకోము. ఒకవేళ మనం ఏదైనా కోరుకున్నా అది మనకి అనుగ్రహింప బడుతుంది. ***"నాయందు మీరును, మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి; అది మీకు అనుగ్రహింపబడును"*** (యోహాను 15:7). ఇంక మనం దేని విషయమై చింతించాల్సిన అవసరం రాదు. ఎందుకంటే యేసు మనతో ఉన్నప్పుడు మన చింత యావత్తు ఆయనే భరిస్తాడు. తరతరాలుగా యేసులేని క్రిస్మస్ పండుగనే అందరూ జరుపుకుంటున్నారు. అంటే యేసుని నమ్మకుండా, ఆయనయందు విశ్వాసముంచ కుండా, ఆయన ఇష్టప్రకారం జీవించకుండానే ఆయన పుట్టినరోజున క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటుంటారు. యేసు మనతో లేకుండా మనం క్రిస్మస్ పండుగ చేసుకుంటే ఆ సంబరం మనకి ఒక్కరోజే. అదే యేసు మనతో ఉంటే ప్రతిరోజూ పండగే. ఆచారంగా చేసే పండుగ కంటే, హృదయంలో యేసుని ఆరాధిస్తూ సంతోషించాలి. మరి యేసుతో దొరికే సంతోషాన్ని జీవితాంతం పొందటానికి, యేసుతో కలిసి క్రిస్మస్ పండుగ చేసుకోడానికి నేడే యేసుని నీ హృదయంలోకి ఆహ్వానించు. మన ఇంట్లో ఎవరైనా పుట్టినరోజు చేసుకుంటే ఆ రోజు వాళ్ళని సంతోషపెట్టడానికి వారికి ఏది ఇష్టమో అది చేస్తాము కదా! యేసు పుట్టిన రోజు అని క్రిస్మస్ పండుగ రోజు మనము మాత్రమే సంతోషంగా ఉంటే సరిపోదు. దేవున్ని కూడా సంతోషపెట్టాలి కదా! యేసుని సంతోషపెట్టాలి అంటే ఆయన చెప్పినట్లు తండ్రి చిత్తము నెరవేర్చడానికి ఏం చేయాలో ఆలోచించి, అది చేసినప్పుడు యేసు నిజంగా సంతోషిస్తాడు. తండ్రి చిత్తాన్ని ఈ భూమి మీద నెరవేర్చ డానికి వచ్చిన యేసుప్రభువునందు విశ్వాసముంచడం ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చి ఆయనను సంతోషపెడదాము. అందుకు నీవు సిద్ధమా?

**సాక్ష్యాలకు ఆహ్వానము**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# నీ సృష్టికర్త

మానవ దేహము, దాని నిర్మాణము, పనిచేయు విధానం, చదివినంతనే దేవుని శక్తిసామర్థ్యాలను మనం కొంత వరకు అర్థం చేసుకోగలం. ఎందుకంటే ఆ శరీరార భాగాలను మనం కళ్ళతో చూడగలం వాటిని పరిశోధించి పరీక్షించి అధ్యయనాలు చేయగలం.

కానీ మనిషి చూడలేని తాకలేని కేవలం అనుభవించగల అంతరింద్రియములను, ఆత్మను మనకు అనుగ్రహించిన దేవుని అపరిమిత జ్ఞానమును ఊహించలేము.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఇన్ని వింతలూ విడ్డూరాలకు కొలువైన మానవదేహం యొక్క ముడిపదార్థం మన్ను (మట్టి). మట్టితో చేసిన మానవుని, సకల సృష్టిని గమనిస్తే ఆ దేవుని బలసంపన్నతలు ఇట్టే అర్థమౌతాయి.

మట్టియైన మానవుని కొరకు ఇంత అధ్భుతమైన సృష్టిని కలుగజేసి, మనుష్యులు జీవించుటకు అవసరమైనవన్నీ అంటే మనుగడ సాగించుటకు వీలుగా వాతావరణం, ఆకలి తీర్చుకొని బ్రతుకుటకు ఆహారం, మంచి నీరు, సూర్యరశ్మి, సురక్షితమైన గాలి... ఇలా భూమిమీద ప్రాణులు జీవించుటకు అవసరమైనవన్నీ ఉచితంగా అనుగ్రహించాడు.

ప్రత్యేకించి మనుష్యులకు ఆత్మీయ వరాలైన సంతోష సమాధానాలు అనుగ్రహించాడు. అన్నిటికంటే ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛను ఇచ్చాడు.

ఇవన్నీ దేవుడు మట్టి ముద్దతో తాను చేసిన మనిషి పై శ్రద్ధవహించి,ఆలోచించి ఉచితంగా అనుగ్రహించిన మరెక్కడ దొరకని, వెలకట్టలేని సంపదలు.

కానీ మనిషి దేవుని ద్వారా తనకు అనుగ్రహింపబడిన ఆధిక్యతలను ఉపయోగించి సృష్టికర్తయైన దేవుని తెలుసు కొనక లోకములోని శరీరాశ నేత్రాశ జీవపుడంబము వంటి వాటి ఊబిలో చిక్కుకుపోతున్నాడు.

దేవుడు కరుణామయుడు కాబట్టే అంతులేని జాలిని కలిగియుండి పాపస్థితిలో ఉన్న మానవునిపై ఆగ్రహించి తగిన శిక్ష విధించుటకు ముందే రక్షించుటకు ప్రణాళిక సిద్ధపరిచాడు.

ఆ రక్షణ ప్రణాళిక ఏమంటే మన్నుతో తాను సృష్టించిన ఒక మట్టి బొమ్మ కొరకు తానే స్వయంగా ఈ భూమి మీద పుట్టి అతి సాధారణమైన జీవితం జీవించి చివరకు వారి కొరకు వారి చేతుల్లోన్నే బలియై పోవడం. తద్వారా మానవుని కి పాపము నుండి విమోచన కలుగజేయడం.

మన చేతితో నిర్మింపబడిన వస్తువు పట్ల మనం ఏ విధమైన వైఖరి కలిగి ఉంటామో ఆలోచించండి. దాని కొరకు కొంత సమయాన్నో ధనాన్నో వెచ్చిస్తామేమో గాని ప్రాణాలు అర్పించుట అనేది కల్ల. కలలో కూడ జరగనిది.

సృష్టించినవాడు సృష్టింపబడిన దానికంటే గొప్పవాడు అనేది నిత్యసత్యం. దానిని గ్రహించిననాడు నాది, నా ఇష్టం, నా జీవితం అని 'నా' ను నొక్కి వక్కాణించే వారందరూతమ వాస్తవస్థితిని గ్రహించి మిక్కిలిగా మనలను ప్రేమించిన ప్రేమిస్తున్న దేవునికి పూర్తిగా దాసోహమవ్వాలి.

తెలిసో తెలియకో స్వార్థం(ఈగో)తో బ్రతుకులీడిస్తూ ఎంతకి తృప్తి అనేది ఎరుగని మానవజాతికి కనువిప్పు కలుగజేయుటకు, నిజమైన శాంతి సమాధానాలు, ఆత్మ సంతృప్తి దేవునికి విధేయత చూపడంలోనే ఉందని తెలియ జేయడానికి, అది ఆచరణ అసాధ్యం కాదని చెప్పుటకు యేసు క్రీస్తు ఈ భూమ్మీద జన్మించి నిస్వార్థం, ప్రేమ అంటే ఏమిటో తెలియజేశాడు.

కాబట్టి ఇకనైన నిన్ను సృష్టించిన సృష్టికర్తను, అపరిమి తమైన ఆయన ప్రేమను, శక్తిసామార్థ్యాలను, జ్ఞాన, బల సంపన్నతలు గుర్తెరిగి నిజరక్షకుడైన యేసుక్రీస్తును అనుసరించి నీ బ్రతుకును మార్చుకో. యేసుక్రీస్తు నీ హృదయంలో జన్మించటయే నిజమైన క్రిస్మస్.

సాక్ష్యము

# నా విమోచకుడు

మా తండ్రిగారు, నా ముగ్గురు అన్నలు ప్రతినిత్యం నమాజు చేసేవారు. వారికి 'అల్లా' అంటే అమితమైన భక్తి. మా తండ్రిగారు 'గోసాల' లో నిమ్మకాయల వ్యాపారం చేస్తూ విజయవాడ దగ్గర 'పెనమలూరు'లో తోటలు కొని వ్యాపారం ప్రారంభించినందున మేము పెనమలూరులో స్థిరపడ్డాము. మా నాయన షేక్ మస్తాన్, అమ్మ బీబీజాన్. వీరికి 8మంది సంతానము. ముగ్గురు మగపిల్లలు, అయిదుగురు ఆడపిల్లలలో నేను రెండవ కుమార్తెను. మాది పెద్ద కుటుంబమైనందున మా తల్లిదండ్రులు ఎక్కువ కష్టపడి మమ్మల్ని పెంచారు. 1979లో నా పదిహేడవ యేట గోసాలవాసి, షేక్ బాజి అనేవారికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆయన పెట్రోలు బంకులో పనిచేసేవారు. 1980లో నాకు ఒక పాప జన్మించింది. అప్పటి నుండి నాకు ఆరోగ్యం సరిగా లేదు. మా అత్తగారు యేసు ప్రభువుకు రహస్య విశ్వాసిగా ఉండినది. నా స్వస్థత కొరకు నేను కూడ రహస్యంగా ప్రార్ధనకు వెళ్ళాను. అలా నాకు స్వస్థత కలిగింది. తర్వాత 1983లో బాబు జన్మించాడు. 1991లో మా ఇంటి వీధిలో సామ్రాజ్యము అనే ఆమెను సాతాను పీడించింది. ఆమెకొరకు ప్రార్ధించ డానికి విజయవాడ పడమటనుండి ఒక పాస్టరుగారు వచ్చారు. అప్పుడు నా భర్త ఆ పాస్టరుగారితో నేను కూడ యేసును కొంతకాలం నమ్ముకున్నానని చెప్పారు. అందువలన పాస్టరు పెనమలూరు వచ్చినప్పుడల్లా నా వద్దకు వచ్చి, వాక్యం చెప్పి, ప్రార్ధన చేసేవారు.

ఒకప్పుడు నేను రోగిగా ఉన్నప్పుడు ప్రభువు నన్ను స్వస్థపరిచిన సంగతికి నేను కృతజ్ఞత కలిగి ఉండలేదు. నా భర్తకు కూడ నేను ప్రార్ధనకు వెళ్ళడం ఇష్టంలేదు. నాకు వాక్యం చెప్పేవారి ముఖములోని దీనత్వం, తగ్గింపు స్వభావం నన్నాకర్షించింది. నేను కొంతకాలం అలా ప్రార్ధనకు వెళ్తూ, వాక్యం వినినందున నేను నా హృదయ పూర్వకంగా ప్రార్ధించనారంభించాను. నేను పూర్తిగా యేసయ్యను ఆరాధిస్తున్నానని తెలిసిన నాటనుండి నా పెనిమిటి నన్ను ప్రార్ధనకు వెళ్ళవద్దని ఆజ్ఞాపించాడు.

ఒకరోజు ప్రార్ధన కూటంలో యేసు ప్రభువు నా యెడల జరిగించిన మేలులన్నీ తలపోసినప్పుడు యేసయ్య మీద నాకు ఎంతో ప్రేమ పుట్టింది. నేను నా పాపముల నిమిత్తము శిక్షించబడవలసి వుండగా – ఆయన నా కొరకు శిలువ మరణం పొంది, నాకొరకు ఆయన శిలువలో కార్చిన రక్తము ద్వారా శరీర స్వస్థత పొంది, ఆయనకు కృతజ్ఞత లేకుండినానని గ్రహించి, అప్పుడే ఓ గంటసేపు ఏడ్చి ఇకమీదట ఆయనకు సాక్షిగా జీవించా లని నిర్ణయించుకున్నాను. నేను ప్రార్ధనకు వెళ్ళినప్పుడల్లా నా భర్త నన్ను బహుగా రక్తము కారేటట్లు కొట్టేవాడు. బాప్తీస్మము తీసుకోవాలన్న ప్రేరణ నాలో కలిగినది. 1992 ఏప్రిల్ నెలలో ఎనికపాడులో యమ్. యేసురత్నం అయ్యగారు నడిపిస్తున్న మీటింగులకు వెళ్ళి అక్కడ బాప్తిస్మం తీసుకొన్నప్పుడు నాకు సంపూర్ణ రక్షణానందము కలిగినది. నేనెప్పుడైనా ఇంట్లో ప్రార్ధన చేసుకొనేటప్పుడు నా పెనిమిటి వస్తే నన్ను కర్రలతో కొట్టేవాడు. బాప్తిస్మం తీసుకొన్న మూడవరోజున నా స్నేహితురాలితో కలసి కానూరులో ప్రార్ధనకి వెళ్ళి ఇంటికి వచ్చేటప్పటికి పొరుగు వారు నీ భర్త నిన్ను ఈరోజు చంపేస్తాడు. కనుక మీ తల్లిగారింటికి వెళ్ళి పొమ్మన్నారు. నేను వెళ్ళలేదు. ఆ రాత్రి నేను దాదాపు చనిపోయేటట్లుగా కొట్టాడు. మరునాడు మా అమ్మ వచ్చి నన్ను ఇంటికి తీసుకొని వెళ్ళింది. ఆ రాత్రి మరలా ఆయన వచ్చి, మా తల్లిదండ్రుల ముందే కొట్టి ఆయన ఎక్కివచ్చిన సైకిలు నా భుజము మీద పెట్టి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మా ఇంటికి మోయిం చుకుని వచ్చాడు. దారిలో ప్రజలందరు చూస్తున్నారు. యేసయ్య! నా కొరకు సిలువ మోశావు కదా! అని ఆలోచిస్తూ సైకిలు మోశాను. మేము ఇంటికి వచ్చిన తర్వాత నా బైబిలును తీసుకొని కాలువలోకి విసిరి వేశాడు. మా ఊర్లో చాలామంది – ఈ కష్టాలు వేదనలు పడేకంటే ప్రార్ధన మానరాదా? అని చెప్పేవారు.

నాకు నా తల్లిదండ్రుల ప్రేమలేదు. భర్త ప్రేమలేదు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు ప్రభువా! నిన్ను వదిలి నేను

జీవించలేను ప్రభువా! అని ఒక రాత్రంతా ప్రార్థించాను. అప్పుడు ఒక స్వరము "మీరు బాగుగా పరుగెత్తుచుంటిరి. సత్యమునకు విధేయులు కాకుండా మిమ్మును ఎవడు అడ్డగించెను" అనేమాట వినిపించింది. ఆ మాట గలతీ. 5:7 లోనిదని తర్వాత తెలుసుకున్నాను. అప్పుడు నా పెనిమిటి కాని, మరెవ్వరు కాని యేసు ప్రేమ నుండి నన్ను ఎడబాపలేరని తెలుసుకున్నాను.

మరునాడు నా చిన్నాన్న షేక్ అబ్దుల్లా నా విషయం నా పెనిమిటిని అడిగినందుకు మా చిన్నాన్న వెళ్ళిపోయిన తర్వాత నన్ను మా పుట్టింటిలో వదలివేసాడు. మా అన్నలు ఆయన మీద కేసు పెట్టారు. మా ఆయనను మూడునెలలు జైలులో వేశారు. తర్వాత మా అన్నలు నన్ను ప్రార్థనకు వెళ్ళవద్దని చెప్పి ఒత్తిడి చేసారు. కాని నేను అలా ఉండలేనని చెప్పాను. యేసును ఎరుగక ముందు ప్రక్కింటి వారితో కూడా మాట్లాడే ధైర్యములేని నాకు ఇప్పుడు అందరిని ఎదిరించి యేసును వెంబడించే ధైర్యం కలిగింది. మా అన్నలు, తల్లిదండ్రులు యేసు ప్రేమవలన ఇలా ఉన్నానని తెలియక, నేనే మారతానని తలంచారు. రెండు నెలలు పోలీస్ స్టేషన్లో ఉండివచ్చిన నా భర్త నన్ను కత్తితో పొడిచాడు. అడ్డం వచ్చిన మా అమ్మను కూడ పొడిచాడు. తర్వాత పాస్టరుగారిని కూడ చంపుతానని వెళ్ళాడు. ఆ సంగతి పాస్టరుగారికి తెలిసినపుడు ఆయన హతసాక్షిగా ఉండటం అది ప్రభువు కృపవల్లే గానీ, అది అందరికీ లభించదు అన్నారు. పోలీసులు నన్ను పిలిచి నా పెనిమిటిపై కంప్లైంటు రాసిస్తే తగుచర్య తీసుకొని నాకు ఎటువంటి ముప్పు జరగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. కాని నేను నా భర్త రక్షణ కొరకు ప్రార్థిస్తూ ఆయన మీద పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయకూడదనుకున్నాను. ఒకసారి నా ఇంటిలో ఆరాధన జరిపిస్తుంటే మా పెద్దన్న, చిన్నన్న వచ్చి వారిని వెళ్ళగొట్టి, నామీద ఖాండ్రించి ఉమ్మివేసి ఇక మమ్ములను నీ సోదరులని ఎక్కడ చెప్పవద్దని తెగ తెంపులు చేసుకొని వెళ్ళిపోయారు.

తర్వాత 1993లో నా భర్త వద్దకు వెళ్ళి 'ప్రియా' పచ్చళ్ళ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. బిడ్డలను పోషించుకోవడానికి ప్రభువు చూపించిన మార్గమని నమ్మిని నా పెనిమిటి నాతో నువ్వు ప్రార్థనకి వెళ్తే ఇంట్లో సామానుతో సహా ఇంటిస్థలం కూడ అమ్మివేస్తానని అన్నాడు. ఒకరోజు ఇంటిస్థలం అమ్మివేశాడు. మరునాడు గ్యాస్ అమ్మివేస్తానన్నాడు. నేను ప్రార్థనకి పోయివచ్చేటప్పటికి గ్యాస్ అమ్మివేశాడు. అన్నిపోయినా ప్రభువా! నువ్వు ఉంటే చాలు అనుకొన్నాను. కట్టెలతో వంట చేశాను. మా ఊరిలో ఆయన సంబంధికులు భార్యను లోబరుచుకొనలేని వాడవని ఆయనతో అన్నప్పుడు ఇంటికి వచ్చి నన్ను హింసించేవాడు. ఒకరోజు రాత్రి బాగా త్రాగి వచ్చి బైబిలును కాల్చి నామీదకు విసిరివేశాడు. ఆయన నన్ను ఎప్పుడు హింసించినా నేను వోకరించి ప్రార్థించేదానను. ఒకరోజు నాకుమార్తెతో కలసి ప్రియా పచ్చళ్ళ కంపెనీ నుండి ఇంటికి వస్తుంటే నా కుమార్తె 'అమ్మా! ఈరోజు నాయన చాలా కోపంగా ఉన్నాడు. మనల్ని నాన్న చంపేస్తాడేమో! పాస్టరు వాళ్ళ ఇంటికి వెళ్దాము' అన్నది. 'మన ప్రభువు పాస్టరు అంకుల్ కంటే గొప్పవాడు. ఆయన మనతోనే ఉన్నాడ'ని చెప్పాను. ఒకరోజు 'వాటర్ హీటరు' ఆన్‌చేసి చేత్తో పట్టుకుని అది ఎర్రగా అయిన తర్వాత నన్ను కాల్చబోతే నేను వారించలేదు. స్తోత్రం చెబుతూ నిల్చున్నాను. ప్రభువా! నేను ఓర్చుకునే శక్తి ఇవ్వు అని ప్రార్థిస్తుంటే ఎర్రగా కాలిన దానిని బయటకు గిరాటు వేసి వెళ్ళిపోయాడు. ఒకసారి గదిలో ఉంచి గ్యాస్ వదలి బయట గడిపెట్టాడు. ఇలా జరుగుతున్న క్రమంలో ప్రభువు స్వరముతో మాట్లాడి, నన్ను అనేకసార్లు బలపరిచాడు. అనేక వచనాలు చూపించి ధైర్యపరిచాడు. 1992 నుండి ఆయన నన్ను సేవలోనికి పిలుస్తున్నాడు. కాని నాకు సరైన అవగాహన లేదు. హైదరాబాదులో నన్నెన్నడు ఎరుగని మిల్టన్ అనే సేవకుడు ఓ మీటింగ్‌లో నన్ను పేరుపెట్టి పిలచి, నేను సేవకురాలని ప్రవచించాడు. 2000 సం॥లో నేను ఉద్యోగం వదలి సేవకు సమర్పించుకున్నాను.


ఒకరోజు కంకిపాడు ప్రార్థనకు వెళ్ళివస్తుంటే నా భర్త నన్ను సెంటర్లో కొట్టాడు. పోలీసులు కేసు పెట్టమన్నారు. నేను ఆయన కొరకు ప్రార్థన చేస్తున్నాను. యేసుప్రభువు ఆయనను మారుస్తాడని చెప్పాను. నా భర్తకు గుండె నొప్పి వచ్చింది. హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళాము. తాగితే చచ్చిపోతావన్నారు. అప్పుడు నేను ఆయనకు చేసిన

పరిచర్యతో ఆయన ఏడవటం ప్రారంభించాడు. నన్ను పెట్టిన శ్రమలు, నన్ను కొట్టిన దెబ్బలు తలచుకొని మూడునెలలు ఆయన ఏడ్చాడు. నన్ను తిట్టిన అన్నయ్య మొదట యేసును తెలుసుకొని నమ్ముకున్నాడు. అలా ఒకరి తర్వాత ఒకరు కుటుంబమంతా దాదాపు యాభై మంది మా అన్నలు, 1999లో నా భర్త ప్రభువును అంగీకరించి ప్రార్థించనారంభించారు. పెనుమలూరులో కొంతమంది సహోదరీలు నన్ను వాక్యము చెప్పమని ప్రోత్సహించారు. మొదట్లో శనివారం, బుధవారం రాత్రి ప్రార్థనలలో వాక్యం చెప్పేదానను. 1993 నుండి ఆదివారం ఆరాధన కూడా నడిపిస్తున్నాను. ముస్లిం కుటుంబం నుండి నన్ను రక్షించిన ప్రభువు 2000సం॥లో తన సేవాపరిచర్య నిమిత్తం పిలిచారు. అప్పటివరకు నేను ప్రియ ఫుడ్స్‌లో ఉద్యోగం చేసేదానను. ఆయన పిలిచిన పిలుపునకు లోబడి ఉద్యోగ మును విడిచిపెట్టి సేవకు సమర్పించు కున్నాను. 2006 వరకు పాస్టర్‌గారి సేవాపరిచర్యలో సహకారిగా ఉన్నాను. అయితే ప్రభువు చిత్తము మేరకు 2006 సెప్టెంబరు 3న సేవాపరిచర్య నిమిత్తము అభిషేకించబడి ఒక విశ్వాసి గృహము వద్ద స్వతంత్రంగా ఆదివారము ఆరాధన నేను ప్రారంభించాను నేను పరిచర్య ప్రారంభించినప్పుడు మాకే విధమైన ఆస్థులు కాని, బ్యాంక్ బ్యాలెన్స్‌లు గాని లేవు. తెచ్చుకుంటే తినడం లేకపోతే లేదు. నేను ఆరాధన జరిగించుచున్న విశ్వాసి గృహం చాలకపోవడం వలన చర్చికి స్థలం కావాలని ప్రార్థించాం. అప్పటికే నా కుటుం బంలో ఉన్న అందరూ దేవుని అంగీకరించి విశ్వాసంలో స్థిరపరచబడినారు. మా పెద్దన్నయ్య షేక్ ఐజక్‌గారు వారి స్థలములో చర్చి కట్టుకోమన్నారు. కాని నేను స్థలం కొరకు ప్రార్థన చేయునప్పుడు ప్రభువు వేరేస్థలం చూపించి దానిని కొనమని చెప్పారు. నా దగ్గర 80వేలు మాత్రమే ఉన్నవి. మాకున్న 5ఆటోలను అమ్మివేసి లక్షన్నర అప్పుచేసి 8 లక్షలకు ఆ స్థలమును మేము స్వాధీనపరచుకున్నాము. అయితే మందిరం నిర్మించడానికి నా దగ్గర 15 వేలు మాత్రమే వున్నవి. వాటితోనే ప్రార్థించి మందిర నిర్మాణం ప్రారంభించి నాము. నేను డబ్బుతో కాక విశ్వాసముతోనే పని ప్రారంభించాను. నా హృదయంలో ప్రభువు మా కొరకు మందిరమును కట్టిస్తారని పరిపూర్ణ విశ్వాసమును కలిగియున్నాను. అందరి కన్నులకు ఆశ్చర్యం కలిగించే విధముగా 2009 జనవరి 1న రెవ. ఎ.జి. మాథ్యూస్ గారి ద్వారా మందిర ప్రారంభోత్సవ వేడుక జరిగినది. 2011లో పైన మరియొక స్లాబ్ వేసి పైన చర్చి క్రింద ఇల్లు కట్టుకుందామనుకొని పని ప్రారంభించాము. అప్పుడు నా దగ్గర లక్షన్నర మాత్రమే ఉన్నవి స్లాబ్ వెయ్యడానికి రెండున్నర లక్షలయ్యింది. స్లాబ్ సెంట్రింగ్ తీయకముందే దానిపైన మరొక స్లాబ్ వెయ్యమని ప్రభువు సెలవిచ్చి యున్నారు అప్పుడు నా దగ్గర డబ్బులు ఏమీ లేవు. ప్రభువు చెప్పిన మాటయందు పరిపూర్ణ విశ్వాసంతో క్రిందవున్న సెంట్రింగ్ చెక్క తీయించి పైన స్లాబ్ నిమిత్తం పెట్టించినాను. మా అబ్బాయి తనకు తెలిసిన బ్యాంక్ ఆఫీసర్‌ద్వారా బ్యాంక్‌లోన్‌ను తీసుకుందాముఅని చెప్పాడు. నేను కూడా అంగీకరించాను. మా బాబు ఆయనను కలిసి విషయం చెప్పినపుడు ఆయన కూడా అంగీకరించి నేను తప్పకుండా సహాయం చేస్తానని చెప్పి నాతో ఫోన్లో మాట్లాడారు. ఆయన అమ్మా మీకు ఎంత కావాలి అన్నప్పుడు 5 లక్షలు కావాలి అని చెప్పాను తప్పకుండా మీకు లోన్ ఇప్పిస్తాను అని చెప్పారు. నేను బ్యాంక్‌వారు చర్చిలకు దేవాలయాలకు లోన్ ఇవ్వరు కదా మీరు ఎలా ఇప్పించగలరు అని అడిగితే ఆయన ఎలాగైనా మేనేజ్ చెయ్యగలను అని చెప్పారు నేను ఆలోచించుకుని ఇది దేవునిమందిరం కాదని ఎలాచెప్పగలము? దేవుడు నన్ను ప్రేమించి ఆయన బలిపీఠం దగ్గర పిచ్చుకలకు నివాస స్థలం దొరికేలా నాకు కృప చూపారు. నేను అబద్ధం చెప్పను ఆయనను ఆశ్రయించు వారిని ఆయన విడిచి పెట్టడు. ఇది మనుష్యుల ద్వారా జరిగే కార్యం కాదని తలంచి నేను, నా కుమారుడు లోన్ విషయం విరమించు కున్నాము. దేవుడు అద్భుతం జరిగించారు. సంఘంలో విశ్వాసుల గుప్పిళ్ళు ఆశ్చర్యకరంగా తెరువ బడ్డాయి. ఒక సహోదరి లక్ష రూపాయలు, మరో సహోదరుడు లక్ష రూపాయలు ఇచ్చారు. ఇలా నలభైవేలు, ఇరవై వేలు, ముప్పైవేలు, డెబ్బై వేలు, పాతికవేలు, అరవై వేలు ఇలా సంఘంలో దేవుని పనికొరకు అనేకమంది విశ్వాసులు ముందుకు వచ్చారు. 2006లో ఏమి లేని నాకు దేవుడు

**(మిగతాది 23వపేజీలో)**

# బైబిల్ ప్రాముఖ్యత

క్రొత్త నిబంధనలో అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాస్తూ, లేఖనములను "దైవావేశము వలన కలిగిన లేఖనములు" అని వర్ణించాడు. 2తిమోతి 3:16,17. అలాగే పేతురు "మనుష్యులు దేవుని వలన ప్రేరేపింపబడి పలికిరి" అని వ్రాశాడు 2పేతురు 2:21. యేసుక్రీస్తు తన సువార్త సేవా కాలంలో ధనాపేక్షగల పరిసయ్యులతో మాట్లాడుతూ "ధర్మ శాస్త్రములో ఒక పొల్లయిన తప్పిపోవుట కంటే ఆకాశమును భూమియు గతించిపోవుట సులభము" (లూకా 16:17) అని ధర్మశాస్త్రము యొక్క ఔన్నత్యమును చాటుతున్నాడు. యేసయ్య, శిష్యులతో "అంతమును" గూర్చి మాట్లాడుతూ "లేఖనములలో వ్రాయబడిన వన్నియు నెరవేరుటకై" (లూకా21:22) అనే మాట వాడియున్నాడు. యేసుక్రీస్తు వారు ప్రవక్తల మాటలను అప్పటి ప్రజలకు లేఖనముల నుండి తిరిగి చెప్పుట మనం గమనించగలము. మత్తయి 13:14లో యెషయా ప్రవక్త చెప్పిన ప్రవచనమును, ఇంకా అనేక చోట్ల (యోహాను 13:18, 15:25, 17:12) లేఖనములను ఎత్తి చెప్పుటలో యేసుక్రీస్తు వారు పరిశుద్ధ వాక్యము దేవుని వాక్యమని రూఢిపరచుచున్నారు. ఇంకా రూఢిగా చెప్పాలంటే లూకా 24:25-27,44 వచనాలలో మనం చూస్తే యేసుక్రీస్తు పునరుత్థానుడైన తర్వాత ఎమ్మాయి అను గ్రామమునకు వెళ్ళుచుండిన ఇద్దరు శిష్యులతో నడచుచూ మాట్లాడుతున్న సందర్భంలో ఆయన ఆ శిష్యులతో "అవివేకు లారా!", "మందమతులారా" అని సంబోధించాడు. కారణమేమంటే యేసుక్రీస్తు వారి పునరుత్థానమును గురించిన ప్రవక్తల పలుకులు వారు నమ్మ లేదు. యేసుక్రీస్తువారు ఈ సందర్భములో (లూకా 24:13 నుండి చివరి వరకు) మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథము, కీర్తనలలో వ్రాయబడిన యధార్ధతను ఎంత గట్టిగా నొక్కి చెప్పియున్నారో అర్ధమవుతుంది. ఆయన ఒకసారి సమాజమందిరములోకి వెళ్ళినప్పుడు (లూకా 4:17) యెషయా గ్రంథపు చుట్టను విప్పి (యెషయా 61:1,2) చదివి ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పెను. ఇలా ఆయన ప్రవక్తల ప్రవచనములను అనగా దైవావేశము వలన కలిగిన ఈ లేఖనములు దేవుని వాక్యముగా అప్పటి ప్రజలకు వక్కాణించియున్నారు.



చరిత్ర కూడా చెపుతుంది పరిశుద్ధ గ్రంథము యధార్ధ మైనదని. గార్డన్ లింన్సెగారు వ్రాసిన పుస్తకంలో ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు. ఐగుప్తు బబులోనులలో జరిగిన భూగర్భ పరిశోధనలలో జలప్రళయం నిజంగా సంభవించినదని ఋజువు కాబడినది. బబులోను చరిత్ర పుటలలో 700 అడుగులకు పైగా కట్టబడిన ఒక గోపురముండెనని అది నిమ్రోద్ ద్వారా కట్టబడినదని ఉన్నది. అబ్రాహాము చిన్ననాటి ప్రాంతమైన "ఊరు" అను పట్టణం ఒకప్పుడు తెలియబడ లేదు. అయితే త్రవ్వకాలలో "ఊరు" యొక్క చాలాభాగం వెలువడినది. సొదొమ గొమొఱ్ఱా పట్టణములు అగ్నిచే నాశనమైన విషయాలు ఈ మధ్య కాలమునాటి భూగర్భ పరిశోధనలలో ఆ పట్టణ ప్రాంత ప్రాంగణాలలో పెద్దయెత్తున Sulfur Bitumen ఉన్నట్లుగా కనుగొనబడింది. యెహోషువ 3వ అధ్యాయంలో, యొర్దాను నది పైనుండి వచ్చు నీరు ఆగిపోగా ఇశ్రాయేలీయులు ఆరిన నేలను నడచిరనిన విషయం నమ్మలేదు. అయితే 1927లో ఇలాగే యొర్దాను నదిపై నుండి వచ్చు నీరు కొన్ని గంటలు ఆగినట్లుగా చరిత్ర చెపుతుంది. ఇలా ఎన్నో విషయాలను ఆయన వ్రాశారు.

ఈ దైవ గ్రంథము యేసుక్రీస్తు వారు ఎక్కడ జన్మిస్తాడో చెపుతుంది. క్రీ.పూ. 500 సం॥లకు పూర్వమే యేసుక్రీస్తు వారు ఈ భూలోకములో జన్మించక ముందే ఆయన యొక్క ఉనికి ఉన్నట్లుగా చెప్పాడు. "పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగు చుండును" (మీకా 5:2). అంతేకాక ఆయన బేత్లెహేములో జన్మిస్తాడని ప్రవచించాడు. గర్భముతో ఉన్న మరియ కాని ఆమె భర్త యోసేపు కాని ఊహించి ఉండరు వారు ఇశ్రాయేలు దేశములోని నజరేతు నుండి బేత్లెహేమునకు వస్తారని. కాని రోమా చక్రవర్తియైన ఔగుస్తు వలన ఆజ్ఞ ఇవ్వబడి ప్రజాసంఖ్యలో వారి పేర్లు నమోదు చేసుకొనుటకు తమ ప్రయాణం తప్ప లేదు. వారు బేత్లెహేములో ఆమె ప్రసవ దినములు నిండి బాలయేసుని కని సత్రంలో స్థలం లేనందున పశులతొట్టెలో పరుండబెట్టెను. మీకా ప్రవచనం దేవుని మూలముగానే కదా పుట్టినది. అలాగే యేసువారు ఒక కన్యకకు జన్మిస్తాడని క్రీ.పూ. 8వ శతాబ్దంలోని యెషయా ప్రవక్త ద్వారా పలుకలేదా! కన్యక గర్భము ధరించి ఒక కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టును (యెషయా 7:14) అలాగే మత్తయి 1:18లో చెప్పబడినట్లు "ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను". అదే అధ్యాయం 21వ వచనంలో ప్రభువు దూత యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినదని సాక్ష్యమిచ్చెను.

ప్రవచనాలు యేసుక్రీస్తువారి పరిచర్యను గూర్చి కూడ పలుకబడినవి. యెషయా 61లో "ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదకి వచ్చియున్నది దీనులకు సువార్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను. నలిగిన హృదయముగల వారిని దృఢపరచుటకును, చెరలోనున్న వారికి విడుదలను, బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును యెహోవా హితవత్సరమును మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకును, దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును... యేసుక్రీస్తు వారు ఈ పరిచర్యలో ఉండగా చెరసాలలో ఉన్న బాప్తిస్మమిచ్చు యోహాను ఈ సంగతులు విని "రాబోవు వాడవు నీవేనా, మేము మరియొకని కొరకు కనిపెట్టవలెనా?" (మత్తయి 11:4) అని తన శిష్యులను పంపినపుడు యేసు వారిని చూసి "మీరు వెళ్ళి విన్నవాటిని, కన్నవాటిని యోహానుకు తెలుపుడి. గ్రుడ్డివారు చూపు పొందుచున్నారు... బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది" (మత్తయి 11:4-6). ఇంకా ఇలాగ యేసుక్రీస్తు వారు పొందబోవు మరణమును గూర్చి, కీర్తనాకారులు, యెషయా భక్తుడు ప్రవచించి యున్నారు.

అందుకే ఈ పరిశుద్ధగ్రంథము యథార్థమును, దేవుని వాక్యమై యున్నదని నమ్ముచున్నాము. మరియు సైన్సు ఏ విధంగా ఈ వాక్యమును దైవవాక్యమని ఋజువు చేయు చున్నదో తెలుసుకుందాం.

"మీకు తెలియదా? మీరు వినలేదా? మొదటి నుండి ఎవరునూ మీతో చెప్పలేదా? భూమిని స్థాపించుటనుబట్టి మీరు దాని గ్రహింపలేదా? ఆయన ఆసీనుడైయున్నాడు...." (యెషయా 40:21,22). అందరూ భూమి బల్లపరుపుగా ఉండేదని ఇప్పటికి 500 సం॥ల పూర్వం వరకు అనుకునే వారు. కొంతమంది ఖగోళశాస్త్రజ్ఞులు ఆకాశములను గ్రహించి భూమి గుండ్రముగా నున్నదని చెప్పినప్పుడు వారిని దూషించి, హింసించి నానా దుర్భాషలాడినారట. అయితే క్రీ.పూ 8వ శతాబ్దములోనే యెషయా ప్రవక్త భూమి గుండ్రముగా నున్నదని వర్ణించాడు. భూమి బల్ల పరుపుగా ఉన్నదని చెప్పేవాళ్ళలో కొందరు ఈ భూమి క్రింద పెద్ద పెద్ద స్థంభాలు ఆధారముగా ఉన్నాయని అనేవారు. అయితే యోబు 26:7లో "శూన్యము పైని భూమిని వ్రేలాడచేసెను" అని వ్రాయబడినది. భూమి తన చుట్టూ తను తిరుగుచూ సూర్యుని చుట్టూ తిరుగుట వలన కదా మనకి రాత్రి, పగలు, ఋతువులు కలుగుచున్నవి! ఇది బైబిలులో యేసుక్రీస్తు ద్వారా పలుకబడలేదా!

**(సశేషం)**

# మదర్ తెరీసా

నశించుపోవుచున్న ఆత్మలపట్ల ప్రభువుకున్న వేదన ఈ మాటల్లో వున్నట్లు మదర్ తెరీసా గుర్తించారు. కల్వరి సిలువపై మానవాళి యెడల దేవుని ప్రేమ ఆచరణలో ప్రదర్శించ బడినది. యేసుప్రభువు ఆ సిలువపై వ్రేలాడుతూ పడిన శ్రమ, తలపై ముళ్ళకిరీటం, చేతులు కాళ్లు మేకులతో కొట్టిన వైనం ఆయన శరీరమంతా రక్తమయమై గుర్తుపట్టలేనంతగా ఆయన ముఖము, ఇదంతా మన రక్షణ కొరకు ఆయన పొందిన సిలువ త్యాగము. మన జీవితంలో ఆ దేవుని ప్రేమను లోకానికి ఆచరణలో చూపగలుగుతున్నామా? మీరు మిమ్మును ప్రేమించు వారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును? (మత్తయి 5:46). ప్రతి వ్యక్తి యెడల దేవునికి ఒక నిర్దిష్ట ప్రణాళిక వుంది. ప్రతి మనిషి దేవుడిని అన్వేషిస్తున్న ప్రత్యేక సృష్టి. మనవలె ప్రతి ఒక్కరు ఈ భూమిపై సంచరించేటువంటి కొద్దికాల యాత్రికు లము అనుకోవాలి. ధనవంతులైనా, పేదవారైనా, నల్లవారైనా, తెల్లవారైనా, వృద్ధులైనా, యువకులైనా, పురుషులైనా, స్త్రీలైనా ఎవరైనా సరే మన ప్రేమ ప్రతి ఒక్కరిపై వుండాలి. అది "అగాపే ప్రేమ". మనము ఏ విధంగానైతే దేవుని ప్రేమను పొందుచున్నామో అదేవిధంగా మనం దేవుని ప్రేమను ఇతరులకు విస్తరింపజేసే వారిగా వుండాలని దేవుడు కోరుచున్నాడు. మన పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మనమును పరిపూర్ణులుగా వుంటూ మన ప్రేమను అందరికీ పంచేటట్లు జీవించాలి. యేసుప్రభువు ప్రేమను ఆచరణలో చూపడమే మదర్ తెరీసా జీవిత ధ్యేయం.

పేదరికంలో మగ్గుతున్న పిల్లలతో గడుపుట మదర్ తెరీసాకు అవధులు లేని ఆనందన్నిచ్చింది. ఆ పిల్లల్లో జాలి, దయ వుండుట మదర్ గ్రహించింది. ఒకరోజు ఒక అన్నా, చెల్లి నిన్న ఉదయం నుండి తినకుండా వున్నారని ఒక చిన్న పాప మదర్ తెరీసా చెవిన వేసింది. ఆ పిల్లలిద్దరూ మదర్ తెరీసాకు చెప్పుటకు సిగ్గుపడుతున్నారు. వెంటనే స్కూలు ఆపేసి మదర్ తెరీసా వారికి భోజన ఏర్పాట్లు చేయుటకు పరుగెత్తింది. అది చూచి పిల్లలంతా ఆశ్చర్య పోయారు. పిల్లలే కాదు అక్కడున్న ప్రతి ఒక్కరూ ఆమె చేస్తున్న పనులు చూచి ఆశ్చర్యపోతున్నారు. తన బడికి వచ్చే పిల్లలందరికీ మదర్ తెరీసా మధ్యాహ్నం పూట పిల్లవానికో గ్లాసుడు పాలు ఇప్పించే ఏర్పాటు చేసింది. భారతదేశంలోని ప్రజానీకంలో మదర్ తెరీసాకు అవినాభావ సంబంధం ఏర్పడింది. నిరుపేదల నిట్టూర్పులు ఆమెలో అనురాగాన్ని పెంచాయి. పసిపాపల ఆకలి బాధలు ఆమెలో ఆత్మీయతను పెంచాయి. కుష్టురోగులు అనుభవించే నికృష్టమైన జీవితాలు ఆమెలో కనికరాన్ని పెంచాయి. దిక్కూ మొక్కు లేకుండా చనిపోయే అభాగ్యుల స్థితిగతులు ఆమెలో దయను పెంచాయి. అందుకు మదర్ తెరీసా 1950లో భారతదేశ పౌరసత్వాన్ని పొంది, భారతీయురాలిగా మారింది. పేద ప్రజల ఓదార్పుకు, వారి సేవలకు తన జీవితాన్ని అంకితం చేసుకుంది. దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించింది. తనను ఎన్నుకొని తన ద్వారా ప్రభువు పనిని చేయుటకు దేవుని చిత్తమైనందుకు ఎంతో సంతోషించింది. మోలేజిల్‌లో నాటిన విత్తనం ప్రపంచమంతా వ్యాపిస్తుందని మదర్ ఊహించి వుండదు.

1949 జనవరి 4న ముగ్గురు టీచర్స్ మదర్ తెరీసాకు సహాయముగా స్కూలులో బోధించుటకు వచ్చారు. 14వ తేదీన బయట వున్న స్కూలును ఒక రూములోనికి మార్చారు. వర్షం బాధ తప్పింది. ఆ ప్రాంతాల్లో వున్న ప్రజలు మదర్ చేస్తున్న మంచి పనులకు సహాయ సహకారాలు అందిస్తు న్నారు. పిల్లల సంఖ్య అయిస్కాంతానికి అంటుకున్నట్లు పెరుగుతూ వుంది. అదే సమయంలో సిస్టర్ రొజారియో డిస్పెన్సరీ మొదలు పెడదామని సలహా ఇచ్చింది. దానికి రూము కావాలి కదా అన్నప్పుడు. స్కూలు గదిని స్కూలు సమయం తరువాత డిస్పెన్సరీగా వాడుకొన వచ్చని సలహా ఇచ్చింది. వెంటనే పేదలకు డిస్పెన్సరీ మొదలైంది. బారులు తీరిన జనం వైద్యం కొరకు వస్తున్నారు. రోగులలో ఎవరైనా క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారా అని మదర్ తెరీసా పరీక్షించే వారు. మందులు బిక్షమెత్తుకొని తెచ్చి, ఉచితంగా ఇచ్చేవారు.

తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, డయేరియా మొదలగు లేబుల్స్‌తో మందుల్ని చిన్న చిన్న పొట్లాలు కట్టి ఇచ్చేవారు. మదర్ తెరీసా తనకంటూ ఒక రూము దొరికితే దానిలో ఉంటూ తన సేవ కొనసాగించాలని రూము కొరకు ప్రయత్ని స్తుండేది. ఒక రోజంతా తిరిగి తిరిగి పేదరికంలోని బాధను అనుభవించి ఒక జర్నల్‌లో ఈ విధంగా వ్రాసింది 'కొందరు నేను చేస్తున్న పనికి ఏమి ఉపయోగముందని అనుకుంటు న్నారు. చాలా మంది నన్ను స్లమ్ సిస్టర్ అని పిలుస్తున్నారు. నా దగ్గర డబ్బు లేకపోయినా, ప్రేమ, అంకిత భావం ఉన్నాయి కనుక వీటినే నిరుపేదలకు పంచుట ద్వారా ఆ దేవునికి మహిమ వస్తుందని సంతోషిస్తాను' అని వ్రాసింది. ఫిబ్రవరి 1949లో ఇంకో జర్నల్లో 'దేవుని చిత్తానుసారము పేదరికంతో కూడిన సిలువతో కప్పబడిన సేవను చేయడా నికి నా యిష్టపూర్తితో వచ్చాను. కానీ ఈ రోజు క్రొత్తపాఠాన్ని నేర్చుకున్నాను. పేదరికం ఎంత కఠినంగా ఉంటుందో తెలుసుకున్నాను. నా కొరకు ఒక ఇల్లు అద్దెకు కావాలని ఊరంతా తిరిగి వెదకి నడిచి నడిచి నా కాళ్ళు చేతులూ నొప్పులు పుట్టేలా తిరిగాను. పేదవారు కూడా వారికి కావల సిన ఇల్లు, కూడు సహాయం కొరకు వారి శరీరం, మనసు ఎంత బాధకు, ఎంత క్షోభకు గురయ్యేవో తెలుసుకున్నాను. అప్పుడు నా మదిలో లోరిటో స్కూల్లోని రాజభవనాలు, వసతులు గుర్తుకు వచ్చాయి. ఒక్కమాట చెప్తే సర్వభోగాలు మళ్ళీ నా వద్దకు వస్తాయి. అపవాది మనసులో దూరు తున్నాడు. నాదేవా, నా అంతట నేను నీపై వున్న ప్రేమతో తీసుకున్న నిర్ణయం. నీ పరిశుద్ధ చిత్తమేమై వున్నదో, అదే నేను కోరుకునేది. ఇంతకంటే ఎక్కువ కష్టాలు వచ్చినా, ఒక్క కన్నీటి బొట్టు రాలకుండా నీ చిత్తాన్ని నెరవేర్చడానికి ఒప్పు కుంటున్నాను. నా దేవా! నీవే నా బలము, నాకు ధైర్యమిచ్చే నీ చిత్తము నెరవేర్చుటకు సహాయము దయచేయుము' అని వ్రాసింది. జర్నల్లో ప్రచురమైన తర్వాత ఫాదర్ వాన్‌ఎగ్జిమె చదివి మదర్ తెరీసాతో క్రీక్‌లేన్‌లో 14 నవంబర్‌లో పాతభవనంలో ఒక గదిని నీ కొరకు చూశానన్నాడు. మదర్ నా వద్ద అంత డబ్బు లేదు అన్నారు. అది నీకు ఉచితంగా మైఖేల్ గోమ్స్‌గారు ఇవ్వడానికి ఒప్పుకున్నారని చెప్పారు. మైఖేల్‌గోమ్స్ ఉదార స్వభావుడు. అతని దగ్గరకు ఒకసారి ఫాదర్ వాన్ ఎగ్జిమ్ వెళ్ళి మదర్ తెరీసా సంగతి చెప్పి ఏదైనా ఒక చిన్న గదిని ఇప్పించమని అర్థించారు. అతను తటపాయి స్తుంటే తన ఎనిమిదేళ్ళ కూతురు మాబెల్ తడుముకోకుండా జవాబిచ్చింది. మన మేడ గది ఖాళీగా వుంది, మదర్ దాని లోకి రావచ్చు అంది. ఎంత ఆశ్చర్యం. 'తండ్రీ, ఆకాశము నకు భూమికిని ప్రభువా నీవు జ్ఞానులకును, వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినా వని నిన్ను స్తుతించుచున్నాను' (లూకా 10:21). ప్రభువు చెప్పిన మాటల్లో నిస్సందేహముగా నిజమున్నది గదా. ఒక అందమైన, ఆనందమయమైన ఇంటిలో ఉచిత నివాసము ఏర్పాటయింది.

28 ఫిబ్రవరి, 1949 సాయంకాలం మదర్ తెరీసా వచ్చి ఆ మేడగదిలో ప్రవేశించింది. ఆమెతో పాటు చారుమా అనే విధవరాలు కూడా వచ్చింది. లొరెటో స్కూల్లో మదర్ పని చేసేటప్పుడు చారుమా మదర్‌కి వంట చేసిపెట్టేది. మదర్ అంటే ఆమెకు పంచప్రాణాలు. మదర్ మేడగదిని ఆక్రమిం చుకున్నారు. ఉదయాన్నే నాలుగున్నరకల్లా లేవడం, ఆరు గంటలకల్లా ధ్యానం, ప్రార్ధనలు, టిఫిన్ ముగించుకొని బడికి వెళ్ళి పిల్లల్ని చూచుకొని అక్కడ నుండి మురికి వాడల్లోకి వెళ్ళి నిరుపేదల మధ్య సేవచెయ్యడం ఆమె దినచర్య. అయితే ఒక్కతే అంత భారమైన పనిచెయ్యడం, అవసరతలో నున్న వారందరి దగ్గరకు వెళ్లడం అసాధ్యము అనిపించింది. ఈ విషయంలో దేవుని ప్రార్థించేది. గదిలో ఒక బెంచి, ఒక పాత పెట్టె, ఒక కుర్చీ, ఒక చిన్న పాత బీరువా మాత్రం వున్నాయి. బెంచీ మీద తన పుస్తకాలను పెట్టుకుంది. బీరువా మీద బైబిల్ గ్రంథాన్ని, మేరిమాత విగ్రహాన్ని పెట్టుకుంది. కొన్ని రోజుల వరకు ఆమె క్రిందనే పడుకుంది. అది చూచిన లొరిటె సిస్టర్స్ ఆమెకు ఒక పరుపును పంపించారు. ఒంట రిగా మొదలైన సేవ భారమని పించేది. సాయంకాలం అలసి పోయి తన గదికి వస్తే కనీసం పలకరించే వాళ్ళు కూడా లేకుండాపోయారు. కొన్నిసార్లు తినడానికి ఏమీ ఉండేది కాదు. అలాగే పస్తులు పడుకొనేది. మరీ ఆకలి బాధకు తట్టుకోలేక పోయినప్పుడు, నెమ్మదిగా మెట్లు దిగి గోమ్స్‌ను అడిగేది. ఒంటరితనం ఆమెను కృంగదీసేది. ఆకలి బాధ నిరుత్సాహపరిచేది. **(సశేషం)**

# తల్లిదండ్రులారా!

మీ బిడ్డలను క్రమమైన మార్గములో, దేవునియందలి భయభక్తులతో పెంచడానికి మీరేం పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాల్సిన అవసరంలేదు. ముందుగా మీ బిడ్డలు దేవునిలో ఎదగాలి అన్న ఆశ, ఆసక్తి ఉండాలి. మీ బిడ్డలను దేవునిలో ఎలా పెంచాలన్న జ్ఞానము మీకు లేకపోతే దేవున్ని అడగండి. *"మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయ చేయువాడు" (యాకోబు 1:5).* ఒకవేళ మీరు మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచాల నుకుంటే, ఎంత తక్కువ వయస్సు నుండి వారిని క్రమములో పెంచడం ప్రారంభిస్తారో మీకు అంత సుళువుగా ఉంటుంది. 'మొక్కై వంగనిది మ్రానైన తరువాత వంగదు కదా'. కాబట్టి మీ పిల్లలకు ఊహ తెలిసినప్పటి నుండి వారికి దేవుడిని పరిచయం చేయడం ప్రారంభించండి. వారికి చదవడం రాదు కాబట్టి, ప్రార్థన చేయడం నేర్పించండి. మీ ఇంట్లో కుటుంబ సభ్యులందరు కలిసి కుటుంబ ప్రార్థన చేసుకోవడం ద్వారా పిల్లలకు దేవున్ని పరిచయం చేయవచ్చు. పిల్లలు బడికి వెళ్ళ నని మారాం చేస్తుంటే, ఏడుస్తుంటే, వారిని బలవంతంగా కొట్టి అయినా సరే బడికి పంపించినట్లే, మీకు ఎన్ని పనులున్నా, ఇష్టమున్నా లేకపోయినా, పిల్లల భవిష్యత్ కోసం ఇంట్లో కుటుంబ ప్రార్థన చేసుకోవడం వలన పిల్లలలో **'దేవుడు'** అన్న భావన ఏర్పడుతుంది. వారు పెద్దవారయ్యే కొద్ది వారితో బైబిలు పూర్తిగా చదివించడం, సండేస్కూలుకి పంపడం, వారికి బైబిలు కథలు చెప్పడం వలన **'దేవుడు'**, **'బైబిలు'** అనేది వారి హృదయములో స్థిరపడిపోతుంది. వారికి 15 సం॥లు వచ్చే వరకు మీరు కష్టపడితే, తరువాత మీరు వారికి చెప్పిన చెప్పకపోయినా వారు దేవుని మార్గం లోనే నడుస్తారు. మీరు వారికి మంచిచెడ్డలు నేర్పకపోతే, వారు చెడు త్వరగా నేర్చుకుంటారు. చిన్నపిల్లలు సైతం ఎవరూ నేర్పకుండానే ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా, డబ్బులు, తినేవి 'దొంగతనం' చేస్తారు. అడిగితే తెలియదు అని 'అబద్ధం' చెప్తారు. ఇవి ఎవరు నేర్పకపోయినా స్వాభావి కంగా వారికి అబ్బుతాయి. ఎందుకంటే, *"నరుల హృదయా లోచన వారి బాల్యము నుండి చెడ్డది"* అని ఆదికాండము 8:21లో వ్రాయబడి వుంది. బాల్యం నుండి చెడ్డదైన వారి హృదయాలోచనను వారిని దేవునియందు భయభక్తులతో పెంచడం ద్వారా మార్చవచ్చును. తల్లిదండ్రులైన మీరు దేవుని సంబంధులో, సాతాను సంబంధులో మీ బిడ్డల ప్రవర్తనను బట్టి చెప్పవచ్చు. మీరు చర్చి కార్యక్రమాల్లో, దేవుని కార్య క్రమాల్లో విరివిగా పాల్గొంటూ చాలా భక్తిపరులుగా ఉండ వచ్చునేమో కానీ, మీ బిడ్డలను దేవునిలో పెంచకపోతే మాత్రం, మీరు వేషధారులైన క్రైస్తవులుగానే మిగిలిపోతారు. దేవుడు మిమ్మల్ని అక్రమము చేయువారి లిస్టులో చేరుస్తాడు. లూకా 13:26లో యేసుప్రభువు విశ్వాసులుగా పిలువబడేవారి గురించి చెప్తూ, *"మీరు– నీ సముఖమందు మేము తిని త్రాగు చుంటిమే; నీవు మా వీధులలో బోధించితివే అని చెప్పసాగు దురు. అప్పుడాయన–మీరెక్కడివారో మిమ్మును ఎరుగనని మీతో చెప్పుచున్నాను; అక్రమము చేయు మీరందరు నా యొద్ద నుండి తొలగిపొండని చెప్పును".* కాబట్టి తల్లిదండ్రు లారా, బిడ్డలను దేవునియందు భయభక్తులతో, క్రమముగా పెంచకపోవడం అక్రమము కాబట్టి, 'దేవుడు మిమ్మును ఎరుగను' అని చెప్పకముందే జాగ్రత్తపడి, మీ బిడ్డలకు దేవున్ని పరిచయం చేయండి. **ఇది దేవుని చిత్తమైయున్నది.**

మీ బిడ్డలపట్ల మీరు అవసరానికి మించి ప్రేమ, జాలి చూపించడాన్నే **'గారాభం'** అంటారు. పిల్లలు సహజంగానే వారు కోరుకున్న వాటిని 'ఏడుపు' ద్వారానో 'గోల' చేసో సాధించుకోవాలనుకుంటారు. పిల్లలు ఏడుస్తున్నారని వారికి అవసరంలేని వాటిని మీరు అనుమతిస్తే రేపు మీరు 'ఏడవాల్సిన' పరిస్థితులు వస్తాయి. *"నీ బాలురను శిక్షించుట మానుకొనకుము బెత్తముతో వాని కొట్టిన యెడల వాడు చావకుండును" (సామెతలు 23:13).* 'బెత్తము' అంటే కర్ర

అని మాత్రమే కాదు కానీ, 'గద్దింపు' అని కూడా అనుకోవచ్చు. పసిపిల్లలను గద్దిస్తారు, పెద్దపిల్లలను బెత్తముతో కొడతారు. పసిపిల్లలుగా ఉన్నప్పుడు గద్దించకుండా గారాభం చేస్తే, పెద్దవాళ్ళయ్యాక బెత్తము వాడాల్సిన పరిస్థితి వస్తుంది. 'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము' అంటే, ఆ త్రోవ ఏంటో ముందుగా మనకు తెలిసి ఉండాలి. త్రోవ అంటే 'మార్గము'. అది దేవుడు వేసిన మార్గము. దేవుని దగ్గరకు మార్గము. ఆదికాండము 6:12లో *"సమస్త శరీరులు తమ మార్గమును చెరిపివేసికొనుయుండిరి"* అని వ్రాయబడిన ప్రకారం, సమస్త శరీరులు దేవుడు వేసిన మార్గమును చెరిపివేసికొని తమ స్వంత మార్గంలో నడుస్తున్నారు. దేవుడు భూలోకమును చూచినప్పుడు అది చెడిపోయి, ఎవరికిష్టమైన మార్గంలో వారు నడుస్తున్నారు. అందుకే దేవునికి చాలా కోపం వచ్చి, జలప్రళయము ద్వారా అవిధేయులందరిని నాశనం చేశాడు. మనం దేవుని మార్గములో నడవకపోతే మనం కూడా నశించిపోతాము. *"ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామెతలు 14:12).* కాబట్టి, బిడ్డలను పెంచే విషయంలో మీరు ఏ మార్గమును ఎంచుకుంటున్నారు? మీ బిడ్డలను మీరు కన్నారు కనుక మీ స్వంత ఆలోచన ప్రకారం, మీకు నచ్చిన మార్గము (త్రోవ)లో వెళ్ళాలనుకుంటున్నారా? లేక "నేనే మార్గమును" అని యేసుప్రభువే స్వయంగా చెప్పాడు కాబట్టి, దేవుని ఇష్టానికి అనుగుణంగా దేవుని మార్గములో వెళ్ళాలనుకుంటున్నారా? ఒకవేళ మీరు మీ బిడ్డలను మీ ఇష్టప్రకారం, మీ ఆలోచనలకు అనుగుణంగా పెంచా లనుకుంటే, మీ బిడ్డల విషయంలో దేవుని బాధ్యత ఏమీ ఉండదు, ఎట్టి పరిస్థితుల్లో కూడా దేవుడు జోక్యం చేసుకోడు. ఒకవేళ మీ బిడ్డలు చెడిపోయి, వారి విషయమై మీరు దేవుని సన్నిధిలో మొఱ్ఱ పెట్టుకున్నా కూడా దేవుడు ఆలకించడు. ఎందుకంటే, దేవుని వాక్యము తెలియని వారి విషయంలోనైతే దేవుడు జాలి చూపిస్తాడేమో కానీ, క్రైస్తవులై యుండి, కొద్దోగొప్పో వాక్య పరిజ్ఞానం ఉన్నప్పటికీ, బిడ్డలను నిర్లక్ష్యం చేస్తే, దేవుడు వారిని క్షమించడు, వారి మొఱ్ఱ వినడు. కాబట్టి తల్లిదండ్రులారా, మీరు ఉద్యోగరిత్యా, వ్యాపారరిత్యా ఎంతో బిజీగా ఉండొచ్చు. డబ్బు సంపాదనలో పడి మీ బిడ్డల ఆధ్యాత్మిక స్థితిని నిర్లక్ష్యం చేసి మీరు సంపాదించిన డబ్బుతో ఆస్తులు కూడబెట్టుకోగలరేమో కానీ, డబ్బుతో మీ బిడ్డలను దేవునిలో ఎదిగేలా చేయలేరు. ఈ లోకానుసారమైన జీవితం జీవించడానికే 'డబ్బు' అవసరమవుతుంది తప్ప, బిడ్డలను దేవుని యందు భయభక్తులతో పెంచడానికి **'డబ్బు'** అవసరం లేదు. మీరు మీ బిడ్డలను **'దేవుని మార్గములో'** నడిపించాలనుకుంటే దేవుడు మీకు తప్పకుండా సహాయపడతాడు. మీ బిడ్డలను దేవునిలో పెంచడానికి తగిన జ్ఞానము మీకు ఇస్తాడు. మీరు చేయాల్సింది ఒక్కటే. ఎట్టి పరిస్థితుల్లో కూడా మీ బిడ్డలను దేవునియందు భయభక్తులతో పెంచాలి అన్న నిర్ణయం తీసుకొని అందుకు కట్టుబడి ఉండటమే. **ఇది దేవుని చిత్తమైయున్నది.** **(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# క్రిస్మస్ ఆనందం - క్రీస్తునందే ఆనందం

ప్రియమైన పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తునామములో శుభములు... క్రిస్మస్ అనేది ప్రపంచంలోనే అత్యంత ఆనందకరమైన పండుగలలో ఒకటి. ప్రకాశవంతమైన లైట్లు, అందమైన అలంకరణలు, కుటుంబ సమావేశాలు, బహు మతులు ఇచ్చిపుచ్చుకొనుట, సంగీతం, వేడుకల్లో– ఇవన్నీ మన హృదయాలను ఆనందంతో నింపుతాయి. కాని ఈ వెలుపలి ఆనందాల వెనుక మరొక గొప్ప, లోతైన ఆధ్యాత్మిక అర్థం ఉంది. క్రిస్మస్ యొక్క నిజమైన ఆనందం, వేడుకలో లేదు క్రీస్తులోనే ఉంది. క్రీస్తు లేకుండా క్రిస్మస్ కేవలం ఒక పండుగ మాత్రమే. యేసుకు మరో పేరు "ఇమ్మానుయేలు - దేవుడు మనకు తోడు" (మత్తయి 1:23). ఈ ఒక్క వాక్యం క్రిస్మస్ ఆనందానికి మూలం. దేవుడు మన పాపాల కారణంగా మన నుండి దూరంగా ఉండలేదు. ఆయన మన లోకంలోకి మన కొరకు వచ్చాడు. మనుష్యుడై, మన జీవితంలోకి అడుగుపెట్టి, మనతో కలిసి నడిచాడు. ఆయన తీర్పు చెప్పడానికి రాలేదు కానీ రక్షించడానికి వచ్చాడు. నీతిమంతుల కోసం కాదు కానీ పాపుల కొరకు, విరిగినలిగిన హృదయాలు కలిగిన వారి కొరకు, ఆశలేని వారి కొరకు వచ్చాడు.

అందుకే క్రిస్మస్ యొక్క లోతైన ఆనందం దేవుడు మనతో ఉన్నాడు అని తెలిసికొనుట. యేసు భూమి మీదకి వచ్చినప్పుడు, ఆయన చీకటిలో వెలుగై వచ్చాడు. "చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు మరణచ్ఛాయగల దేశనివాసుల మీద వెలుగు ప్రకాశించును." (యెషయా9:2). ఈ వెలుగు యేసుక్రీస్తే. ఆయన జన్మించక ముందు ప్రపంచం పాపం, భయం, నింద, బాధ నిరాశ అనే చీకటితో నిండిపోయి ఉంది. ఏ మనిషి ప్రయత్నం కూడా ఆ చీకటిని తొలగించ లేకపోయింది. అందుకే దేవుడు తన వెలుగును పంపాడు. యోహాను 1:5లో రాయబడిన ప్రకారం, "ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను.." యేసు మన హృదయంలోకి వస్తే, చీకటి వెళ్లిపోవాల్సిందే. ఎందుకంటే ఆయన ఉనికే మనకు ఆశ, శాంతి, స్పష్టత బలాన్ని ఇస్తుంది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

సృష్టికర్త శిశువై పశువులపాకలో పుట్టాడు. నక్షత్రాలను పట్టి ఉంచే దేవుడు, మనుషుల చేతుల్లో పట్టబడ్డాడు. ఎందుకు? మన మీదున్న అపార ప్రేమ వలన. పశువుల పాకలో పుట్టిన ఆ శిశువు ఒక సందేశం చెబుతున్నాడు. "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగునుగాక అని దేవుని స్తోత్రము చేయుచుండెను" (లూకా 2:14). పాపమువల్ల దేవునితో మన సంబంధం తెగిపోయింది. కాని యేసు ఆ గోడను కూల్చాడు. "కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము" (రోమా 5:1).

క్రిస్మస్ కేవలం బేత్లెహేములో శిశువు పుట్టిన కథ కాదు. అది మన హృదయంలో క్రీస్తు జన్మించిన అనుభవం. బయట క్రిస్మస్ జరుపుతున్న వారి హృదయంలో ఖాళీ ఉంటుంది. కాని క్రీస్తు మనలోకి వచ్చి నివసించినప్పుడు, ప్రతి రోజు క్రిస్మస్‌లాంటి ఆనందం ఏర్పడుతుంది. పండుగ వలన వచ్చే ఆనందం ఒకరోజే మాత్రమే వుంటుంది, కానీ క్రీస్తు ఇచ్చే ఆనందం శాశ్వతం.... బేత్లెహేము శిశువు ఇప్పుడు మహిమలో నివసిస్తున్నాడు. మనతో నడుస్తున్నాడు, మనలను నడిపిస్తున్నాడు, బలపరుస్తున్నాడు, మనలో ఆయన ప్రేమ పరిశద్ధాత్మ ద్వారా నివసిస్తుంది.

మనలో క్రీస్తు లేకుండా చాలామంది క్రిస్మస్ జరుపుకుంటారు. వారు నక్షత్రములను వెలిగించెదరు కానీ వెలుగును కోల్పోతారు. బహుమతులు ఇస్తారు కానీ పరలోక బహుమతిని కోల్పోతారు. విశ్వాసులకు క్రిస్మస్ ఒక తేదీ కాదు - అది యేసు గురించి, ఆయన జననం, ఆయన ప్రేమ, ఆయన సమాధానం, ఆయన రక్షణ, ఆయన వాగ్దానాలు, ఆయన సన్నిధి - ఇవన్నీ ప్రతిరోజూ మన జీవితానికి అర్థం ఇస్తాయి. నిజమైన క్రిస్మస్ ఆనందం అలంకరణలలో, బహుమతులలో, విందులలో లేదు. నిజమే - క్రిస్మస్ యొక్క ఆనందం క్రీస్తునందే ఉన్న ఆనందం. క్రీస్తు మనలో ఉంటే ప్రతి రోజు క్రిస్మస్ రోజు లాంటిదే. మీ అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు.

**–ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

కుటుంబం విషయంలో దేవుని వాగ్దానం భార్యా, భర్త, బిడ్డలు దేవుని ఆజ్ఞలు ఆచరిస్తే పరలోకమును భూమి మీద ఉన్న మన ఇంట్లో అనుభవిస్తాము. మన ఇల్లు భూమి మీద 'పరలోకపు కాలనీ' అవుతుంది. అయితే దేవుని చిత్తము మన ఇంట్లో నేరవేర్చబడుటకు చాలా వ్యత్యాసం కనబడు తుంది. మానవులకైన దేవుని ప్రతి దీవెనకు ముందుగా కొన్ని కట్టడలను కుటుంబమునకైన కొన్ని విధులను నెరవేర్చవలసి ఉన్నది.

ఈ లోకంలో ప్రతి కుటుంబము కొంత డబ్బు, కొంత పలుకుబడి, గొప్ప స్థితి కావాలని కోరుకుంటారు. కష్టపడి సంపాదిస్తారు. పెద్ద ఇంజనీరు అయినా, డాక్టరు అయినా గొప్ప కార్యాలు చేసి కుటుంబమునకు పేరు ప్రతిష్టలు తేవచ్చును. కానీ తన ఇంట్లోకి పరలోకమును తేవాలనే ఆలోచన కూడా లేకుండా ఉండవచ్చు.

పెద్ద పెద్ద స్వస్థత కూడికలు, పెద్ద పేరు ప్రఖ్యాతులు సంపాదించ వచ్చును. కాని తన కుటుంబములో పరలోక రాజ్యము లేకుండా ఉండవచ్చును. పరలోక రాజ్యము మన కుటుంబములోనికి రానిదే అక్కడ నెమ్మది, విశ్రాంతి ఉండదు. ఇందుకు బాధ్యత భార్యాభర్తలు ఇద్దరు సమానంగా తీసుకోవలసి ఉంది. దీనిలో పిల్లల ప్రమేయము ఏమీ లేదు. ఎందుకంటే మన ఇంట్లో పెరిగిన బిడ్డలు కేవలం మనం పెంచిన విధంగా పెరుగుతారు.

ఆదామును దేవుడు సృజించినప్పుడు హవ్వ అసలు సృజించబడలేదు. హవ్వను దేవుడు చేసినప్పుడు ఆదాము గాఢనిద్రలో ఉన్నాడు. ఇద్దరు ఒకరినొకరు తెలుసు కొనవలసినవారై యున్నారు. ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకొన ప్రయత్నం చేసుకొనేటప్పుడు దేవుని వాక్యము మధ్యలో పెట్టుకున్నట్లయితే సమస్య ఉండదు. మన ఇంట్లో పడకగది నుండి ప్రతి మూల ఎక్కడ చూసినా మనం బట్టలు పెట్టుకునే బీరువా, దానిలో వున్న బట్టలు కూడా దేవుని రాజ్యమును మన ఇంట్లోకి తెచ్చేవిగా గాని, పోగొట్టుకునేవిగా గాని ఉంటాయి.


భార్యాభర్తలు తమ ఇంట్లోకి పరలోకమును తీసుకొని వచ్చియుంటే, ఆ భార్యా భర్తలు ఇరుగు పొరుగున ఉన్న కుటుంబాలకు కూడా ఈ విషయంలో సహాయపడగలరు. ప్రభువులో నివశించే భార్యాభర్తలు పొరుగింటి వారితో ఎన్నడూ వైరము కలిగియుండరు. వైరము వచ్చేటట్లయితే సిలువనే మోస్తారు గాని, తమ గొంతు వీధిలో వినబడ నీయరు. తమ కుమారులను, కుమార్తెలను ఆత్మీయ జీవితం కొరకు యూత్ రిట్రీట్లకు పంపించేవారు ఎక్కువమంది తల్లిదండ్రుల కుటుంబములో పరలోకరాజ్యపు కాలనీగానే ఉంటుంది. తప్పిపోయిన బిడ్డల కొరకు రెండవసారి క్రీస్తులో ప్రసవ వేదన పొందుతారు.

తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవాలని, గొప్ప స్థితిలో ఉండాలని పిల్లల కొరకు వెచ్చించే ధనములో, శ్రద్ధలో ఒక పాతిక భాగమైనా బిడ్డల ఆధ్యాత్మిక జీవితము కొరకు వెచ్చిస్తే నేటి క్రైస్తవ సమాజం మరోలా ఉంటుంది. క్లాసు పుస్తకాలు కొనడానికి వేలు వేలు ఖర్చుచేసే తల్లిదండ్రులు చాలామంది కుటుంబములోని ప్రతి బిడ్డకు ఒక ఖరీదైన బైబిలు కొనవచ్చును. ఇంటికి వచ్చే క్రైస్తవ ఆధ్యాత్మిక పత్రికలను చదవమని ప్రోత్సహించవచ్చును. పూర్వం జీవించిన భక్తుల జీవిత చరిత్రలను బిడ్డలతో చదివించాలి.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - డిసెంబర్-2025

**ఎలీమెలెకు కుమారుడైన రూతు భర్త పేరు ఏమిటి? (రూతు)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కిడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 250/- లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు............................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**నవంబరు-2025 ప్రశ్న జవాబు :**
**ఇశ్శాఖారు గోత్రము (న్యాయాధిపతులు 10:1)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. సిహెచ్. దయరాజు, రామానుజాపురం
2. టి. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు
3. కె. మేరిపవిత్ర-మంచిర్యాల
4. కె. అశోక్‌కుమార్-ఒంగోలు

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| కర్మేల్ హెల్త్‌కేర్, పులివెందుల | (08-07-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (06-12-24) | 3000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| పి.వి.కెరోలిన్, గుంటూరు | (11-12-24) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-03-24) | 1000 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (25-12-24) | 500 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (06-11-24) | 500 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (10-11-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-08-24) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| సిహెచ్. దయరాజు, రామానుజపురం | (05-11-25) | 350 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |
| ఆర్.ఆర్.కె.పీటర్-విశాఖపట్నం | (23-03-25) | 350 |
| పి. జాన్‌బాబు-గోపాలపురం | (21-03-25) | 350 |
| ఎ. ప్రభుచరణ్-జగిత్యాల | (19-03-25) | 350 |
| పి. నీలిమారాజారత్నం, ఉయ్యూరు | (14-03-25) | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (17-12-24) | 350 |
| సిహెచ్. శైలజ, విజయవాడ | (04-04-25) | 200 |

చిన్నపిల్లల పేజి

# క్రీస్తు మనస్సు

చీకటి పడుతున్నప్పటికి క్రిస్మస్ సమయం కావడంతో రోడ్లన్నీ కిక్కిరిసి ఉన్నాయి. ఎటు చూసిన రకరకాల నూతన వస్త్రాలు, కాంతులీనే అలంకరణ సామాగ్రి, ఆకర్షణీయమైన వివిధ రంగులలో నక్షత్రాలు, క్రీస్తు పుట్టుకను తెలియజేసే పశువులపాక, బాలయేసు, మరియ వంటి వివిధ రకాల బొమ్మలతో, అత్యంత ఆకర్షణీయంగా అలంరింపబడిన క్రిస్మస్ ట్రీలతో దుకాణాలన్నీ చాలా అందంగానూ, బిజీగాను ఉన్నాయి.

రద్దీగా ఉన్న ఆ వీధిలోలోని చిన్న క్రైస్తవ అనాధశ్రమంలో ఉండే ఎనిమిదేళ్ళ దేవిడ్ రాత్రి భోజనానంతరం క్రొత్తగా ఇవ్వబడిన ఉలెన్ బ్లాంకెట్‌ను కప్పుకుని ఆ దుప్పటి ఎంత వెచ్చగా ఉందో అనుకుంటూ, చలిలో ఆ వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ కిటికీ లోనుండి బయటకు చూస్తున్నాడు .

వీధులన్నీ రంగురంగుల దీపాల కాంతులతో అలంకరింపబడిన ఇండ్లు, వాటిపై రకరకాల నక్షత్రాలు, కాంతులీనుతున్న క్రిస్మస్ ట్రీలతో మెరిసిపోతున్నాయి. చర్చి అలంకరణ అయితే క్రిస్మస్ సంబరం అంబరాన్ని అంటే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ చలిలో వణకుతూ నడువలేక నడుస్తున్న ఒక తాత కనిపించాడు దేవిడ్‌కి. తాత వాలకం చూస్తే అర్థమైపోతుంది తాత ఎంత పేదరికంలో ఉన్నాడో. ఒంటి మీద అక్కడక్కడ చిరిగిపోయిన బట్టలు. చలి తట్టుకోవడానికి తాత కప్పుకున్న శాలువా కూడా చీకిపోయింది. నడవడానికి కూడా ఎంతో కష్టపడుతున్నాడు. చివరికి తాత నడవలేక ఒక చెట్టు క్రింద కూలబడ్డాడు. తాతను చూసి దేవిడ్‌కి పాపం అనిపించింది.

వెంటనే దేవిడ్ తన బ్లాంకెట్‌ను తీసుకుని వెళ్ళి కప్పాడు. ఆ వెచ్చదనానికి తాత కాస్త తేరుకుని దేవిడ్‌కి ధన్యవాదాలు చెప్పి అక్కడ నుండి బయలుదేరాడు. తాతకు సహాయపడినందుకు దేవిడ్ సంతోషించాడు. కానీ చలికి వణుకుతూ తిరిగి గదికి చేరాడు.

మరునాడు జ్వరంతో బాధపడుతున్న దేవిడ్‌ను పరీక్షిస్తూ చలిలో తిరిగినట్లున్నావు అందుకే జ్వరం వచ్చింది అంటూ జ్వరానికి టాబ్లెట్ ఇచ్చింది హోం వార్డెన్ అయిన మేరి.

మధ్యాహ్నం భోజన వేళలో దేవిడ్‌కి జ్వరం తగ్గిందో లేదో చూడడానికి వచ్చిన మేరికి వణుకుతు చిరిగిపోయిన పాత దుప్పటి కప్పుకొని కాళ్ళు ముడుచుకుని పడకున్న దేవిడ్ కనబడ్డాడు. దేవిడ్ తలగడ వద్ద మరెటువంటి బ్లాంకెట్స్ కనబడలేదు. అదేమిటి? నాలుగు రోజుల క్రితమే కదా క్రొత్త దుప్పటి ఇచ్చాను అనుకుంటూ దేవిడ్‌ను నిద్రలేపి నీకివ్వబడిన క్రొత్త బ్లాంకెట్ ఏది అడిగింది మేరి.

నా దగ్గర ఈ దుప్పటి మాత్రమే ఉన్నది అంటూ తాతను గూర్చి చెప్పాడు. నీకు దుప్పటి అవసరమే కదా, మరి నీవెందుకు నీ క్రొత్త దుప్పటి తాతకు ఇచ్చావ్? ప్రశ్నించింది మేరి. గదిలోపలే ఇంత చలిగా ఉంటే ఇక బయట ఉన్న తాతకు ఈ పాత దుప్పటి ఏ విధంగాను ఉపయోగపడదు కదా! అందుకే తాతకు నా క్రొత్త దుప్పటి ఇచ్చాను అన్నాడు దేవిడ్.

తాత అవసరతను నీవు తీర్చావు. దేవుడు నీ అవసరతను తప్పక తీరుస్తాడు దేవిడ్ అంటూ గదిలోకి వచ్చిన పాస్టర్ గారు ఒక బాక్స్‌ను దేవిడ్‌కి అందించాడు. ఆ బాక్స్ మీద “దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరతను తీర్చును” ఫిలిప్పీ 4:19 అని ఉంది. బాక్స్ ఓపెన్ చేసిన దేవిడ్ సంతోషంతో పాస్టర్‌గారికి ధన్యవాదాలు చెప్పాడు. అది ఒక చలికోటు.

నాలుగు నెలలుగా చర్చిలోనే పడి ఉన్న చలికోటు అవసరతలో ఉన్న ఒక మంచి అబ్బాయికి అందినందుకు పాస్టర్‌గారు మనసులో దేవునికి వందనాలు చెల్లించారు.

యేసుక్రీస్తు ప్రభువుకు కలిగిన మనసు కలిగి ప్రవర్తించుట ద్వారా యేసుక్రీస్తు మన హృదయంలో మరలా జన్మిస్తాడు. అదే నిజమైన క్రిస్మస్.

**(12వ పేజీ తరువాయి...)**

2013 ఏప్రిల్ నాటికి చర్చి, ఇల్లు సిద్ధపరచి ఇచ్చారు. ఆయన ద్వారా కలిగే ఆశీర్వాదాలు బైబిల్ గ్రంథంలో మాత్రమే కాదు–నాలాంటి 'సామాన్యమైన వ్యక్తి జీవితం లోను జరుగుతాయి. సంఘంలో వచ్చిన ప్రతి రూపాయి మొదటి నుండి సేవాపరిచర్య నిమిత్తమే ఖర్చు పెట్టేదాన్ని. వ్యక్తిగతంగా ఇంటిపోషణ అంతా నాభర్త సంపాదన ద్వారా జరిగేది. మందిర నిర్మాణం జరిగింది. ఇది చూచువారికి ఎంతో ఆశ్చర్యం. అనేకమంది మీ అభివృద్ధికి కారణమేమి టని నన్ను అడుగుతుంటారు. నేను ఒక విషయం చెప్ప దలుచుకుంటున్నాను. ప్రభువును నేను ఎరిగిన నాటి నుండి నేటి వరకు భయభక్తులు కలిగి జీవిస్తున్నాను. నేను పనికి వెళ్ళేటప్పటి నుండి విరమించినంత వరకు కూడా రెండంతల దశమభాగం తీసేదాన్ని. నా పరిస్థితే 'ఆర్థికంగా చాలిచాలనట్టుగా ఉన్నప్పటికి ఈ క్రమాన్ని ఆపలేదు. అది నేటికీ కొనసాగబడుతుంది. ప్రభువు నాకు అనుగ్రహించిన పరిచర్యలో రోగులను స్వస్థ పరచు కృప వరము ఒకటి. సంఘంలోకి అనేక రకాల రోగాలతో బాధపడేవారు వచ్చి స్వస్థత పొంది ఆరోగ్యవం తులుగా మార్చబడ్డారు. ఇంకా త్రాగుబోతులు, వ్యభిచారులు, చెడు వ్యసనాలతో జీవించిన వారు మార్పునొంది విశ్వాసులుగా మార్చబడి ప్రభువును ఆరాధిస్తున్నారు. నానా విధములైన శోధనలతో బాధలతో వేదన భరితమైన జీవితం జీవిస్తున్నవారు ప్రభువు దగ్గరకు వచ్చి నెమ్మది కలిగి సంతోషంగా జీవిస్తున్నారు. ప్రభువు నన్ను తన ఆత్మతో నింపి అభిషేకించి. తన సేవా పరిచర్యలో విరివిగా వాడుకుంటున్నారు. ప్రభువు నా కుమారుడైన ఆమోస్‌పాల్‌ను కూడా పరిచర్యలో సహకరించుటకు సిద్ధపరిచారు. బైబిల్ ట్రైనింగ్ తీసుకొని అగాపే మినిస్ట్రీస్ పాస్టర్ పి.టి.వర్గీస్‌గారి ద్వారా సేవ కునిగా అభిషేకించబడి సేవలో నాకు మంచి సహకారిగా ఉన్నాడు. ఈ రీతిగా నా భర్త, నా పిల్లలందరు సేవా పరిచర్యలో ముందుకు సాగుతున్నాం. ఈ రీతిగా మునుపు ఏ ప్రభువునుబట్టి హింసించబడి, తరమబడి కొట్టబడి కుటుంబములో వెలివేయబడ్డానో తుదకు ఆ ప్రభువునందే నా కుటుంబమంతటితో సంతోషకరంగా జీవిస్తున్నాను. ప్రభువుకు మహిమ కలుగును గాక, ఆమేన్!

ఇట్లు మీ ప్రియ సహోదరి షేక్ తబిత
లివింగ్ గాస్పల్ మినిస్ట్రీస్.

## బైబిల్ పద వినోదము-11 జవాబులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ము | ళె | పా | నీ | ఆ | ను | వు | పా | నీ | ము | ఓ | దే | లు | గ్దో | మి |
| ట | రు | మా | వా | జ్ఞ | తా | హో | రా | యె | న | స్నా | గు | దై | పీ | వు |
| ఘూ | శ్ర | మ | ద | లు | దా | ద్ధ | ను | ము | ఠ | పీ | లి | బ | హ | రె |
| నే | న్నా | డు | హ | నే | ని | హో | వి | భం | స్తం | ప | దీ | గా | హీ | ఫీ |
| ను | నీ | సీ | న | కు | రే | క | రు | ణా | పీ | ఠ | ము | ళ్ళ | రో | దీ |
| మె | న్న | నా | బ | బు | చు | చు | పిం | మా | రా | జ్ఞా | ఆ | రే | తు | ము |
| ఆ | రీ | యి | లి | య | కీ | ఆ | హో | లి | యా | బు | న | పూ | ఆ | జ్ఞ |
| ను | అ | బా | ని | మే | బ్రో | టి | బె | స | లే | లు | న్ని | న | న | ల |
| రా | బే | త | ను | ఘ | తు | కో | స | రిం | చి | న | గో | డు | వె | చు |
| ల | డ | సీ | ము | స్తం | హ | యె | ర | న | ము | ము | షె | ని | కొ | దీ |
| హో | నీ | దే | తా | భం | త్తా | వు | ము | హూ | ద్ర | స | ను | దై | న | యె |
| మీ | రు | మి | ఏ | భూ | వా | ఏ | రా | వా | ము | ద | హో | సీ | హో | ను |
| ద | ను | దు | న్న | స | మ | లీ | బీ | స్త | స | మం | జ | న | ము | ము |
| ని | టె | ఘో | శా | ప | ము | ము | అ | కం | ర్ర | షు | దే | కా | ల | త్రీ |
| న్ను | హె | ఏ | చ్చిం | చు | అ | గ్ని | స్తం | భం | ఎ | ఓ | మె | రు | ను | షి |

**జవాబులు పంపినవారు :**

1. యం. స్వయంప్రభ–చిలకలూరిపేట, 2. టి. యేసు దయమ్మ–వలపర్ల, 3. కె. లలితాభాగ్యం– కనిగిరి, 4. కె. మార్టిన్ మధుచరణ్–పులివెందుల, 5. దయరాజు–రామానుజపురం, 5. పి. జెర్మియా–చిన్నరావూరు 6. కె. ప్రభాకర్–వెంకటగిరి, 7. కె. అశోక్‌కుమార్–ఒంగోలు, 8. కె. రజని–నరసరావుపేట, 9. కె. యేసురత్నం–ఒంగోలు, 10. కె. లలితాభాగ్యం– కనిగిరి, 11. టి. క్రిస్టియానమ్మ– నందికొట్కూరు, 12. కె. మేరిపవిత్ర–మంచిర్యాల


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు** - రూ. 250/-
(అపొస్తలుడైన పౌలు కథ – నవల)

**జప్నత్పనేహు** - రూ. 250/-
(యోసేపు కథ – నవల)

**నా చిత్తానుసారుడు** రూ. 250/-
(దావీదు కథ – నవల)

**మిక్కిలి సాత్వికుడు** రూ. 150/-
(మోషే కథ – నవల)

**గోత్రకర్త** (యాకోబు కథ–నవల) రూ. 250/-

# భైబిల్ పద వినోదం - 12

## యేసు పుట్టుక - బాల్యము

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మా | రు | మ | న | స్సు | గ | ఇ | ధూ | ది | దూ | ము | న | స | హో | సిం |
| క | ద | ర్శ | న | ము | లి | ము | ప | వి | లం | త | జ | ప్ర | గో | ము |
| ద | న్య | రి | కి | ము | ల | హే | వే | స్మ | ప్ర | ధా | న | ము | ని | ణ్యా |
| వు | బో | క | ళ | గ | య | త్లె | ది | య | లు | క | ల | క | లు | ర |
| ము | ప | బో | మ | హా | సం | బే | క | ము | గ | బ్రి | యే | లు | ద్రా | అ |
| ర | రి | సు | యే | న | సం | జ్ఞ | లు | మై | ర | తి | క | ష | గొ | తో |
| గా | శు | వ | సు | బా | ప్తి | స్మ | ము | ర్త | న్న | ము | లే | ష | రూ | యె |
| బం | ద్ధా | మీ | క్రీ | ను | యూ | దా | నే | సు | ము | న | ణి | బ్రా | సాం | మా |
| కు | త్మ | తె | స్తు | లి | ప | శు | వు | ల | పా | క | య | ను | సు | జే |
| ను | అ | బీ | యా | న్నా | చు | యు | ప | స్కా | పం | డు | గ | హో | మె | డు |
| అ | దా | న | జ | రే | తు | ఎ | వీ | దా | వీ | దు | దు | యో | యో | రు |
| వ | దు | మ | అ | మం | ణ | లీ | పు | హే | రో | దు | ట్ట | ప | ను | మా |
| మా | జె | రి | ర్కె | యొ | నే | స | సే | డు | వా | గ | మూ | డు | ర | కు |
| న | క | య | లా | ర్దా | కు | బె | యో | ర | కొ | మీ | డు | కు | క్ష | య |
| ము | ర్యా | పు | యు | ను | ట్టి | తు | యు | న్నా | ర్తి | వ | క్ర | చ | డు | ప్రి |

పేరు...................................గ్రామము...................................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు...................................

**'బైబిలు పద వినోదము-12'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| కల | యూదా | దూత | యేసుక్రీస్తు | బంగారము | నజరేతు |
| బేత్లెహేము | గలిలయ | ప్రధానము | విస్మయము | దర్శనము | మూగవాడు |
| అరణ్యము | సుమెయోను | బాప్తిస్మము | అర్కెలాయు | గబ్రియేలు | చక్రవర్తి |
| అవమానము | పస్కాపండుగ | ఎలీసబెతు | యెరూషలేము | ధూపవేదిక | మారుమనస్సు |
| పరిశుద్ధాత్మ | సింహాసనము | మరియ | యోసేపు | యోహాను | జెకర్యా |
| బోళము | సాంబ్రాణి | సంజ్ఞలు | దావీదు | అబీయా | కన్యక |
| యొర్దాను | గొర్రెలు | హేరోదు | పశువులపాక | ప్రియకుమారుడు | సున్నతి |

పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

(లూకా. 2:10,11)